

తలరాతను మారుద్దాం -6లో

నేడు ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ డే

అప్పుడేమో.. మిడిసిపాటు.. ఇప్పుడేమో.. తడబాటు

వెలవెలబోతున్న పార్టీ కార్యాలయాలు

ఆంధ్రజ్యోతి విజిట్

అప్పుడు..

అప్పుడేమో మిడిసిపాటు. ఆ పార్టీ, ఈపార్టీ అనే తేడా లేకుండా కాలికి బలపం కట్టుకుని మరీ తెగ తిరిగేవారు. తమ పార్టీ జిల్లా కార్యాలయాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే వారు. గంటల కొద్ది సంభాషణలతో తిష్టవేసేవారు. ఇక్కడి నుంచే ప్రత్యర్థి పార్టీలపై సవాళ్ళు, పెను సవాళ్ళు విసిరేవారు. ఆరోపణలు, విమర్శలు గుప్పించేవారు. మాదే అధికారమంటూ తెగ రెచ్చిపోయి కనిపించే కార్యకర్తలతో పార్టీ కార్యాలయాలన్నీ కిటకిటలాడేవి. ఆయా పార్టీల పతాకాలతో కళకళలాడేవి. వచ్చీపోయే నాయకులతో సందడిగా ఉండేది. పత్రికా సమావేశాలు, కార్యకర్తల సమావేశాలకు కొదువేలేదు. ఎన్నికలకు ముందు ఈ కోలాహలమంతా అన్ని పక్షాల కార్యాలయాల్లోను కొట్టొచ్చినట్టు కనిపించేది. సీటు వచ్చినవారు, రాని వారు ప్రతీరోజు ఇక్కడ హాజరు వేయించుకోవాల్సిందే. అంతలా వ్యవహారం సాగింది.



గన్‌బజార్ సీఎస్ఐ చర్చి సమీపంలో వెలవెలబోతున్న వైసీపీ కార్యాలయం



అమీనాపేటలోని టీడీపీ కార్యాలయం ఇలా..



పవర్‌పేటలోని జనసేన కార్యాలయం



ఆశోక్ నగర్‌లో సందడి లేని బీజేపీ కార్యాలయం

ఇప్పుడు..

అధికార మార్పిడి జనాభిప్రాయం మేరకు జరగనే జరిగింది. వైసీపీ అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి నాలుగు నెలలు గడుస్తోంది. ఎన్నికలకు ముందు కళకళలాడిన పార్టీ కార్యాలయాలన్నీ ఇప్పుడు వెలవెలబోతున్నాయి. కార్యకర్తలు, నాయకుల రాకపోకలు పూర్తిగా తగ్గాయి. ఎమ్మెల్యే, ఎంపీ క్యాంపు కార్యాలయాలన్నీ కిటకిటలాడుతున్నాయి. జిల్లా పార్టీ కార్యాలయాలు జనం లేక వెలవెలలాడుతున్నాయి. సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రులెవరూ తొంగి చూడకపోవడంతో తెలుగుదేశం కార్యాలయం నీరుగారుతూ కనిపిస్తోంది. కూటమిలో భాగస్వాములైన బీజేపీ, జనసేన కార్యాలయాలదీ ఇదే పరిస్థితి. అంతకంటే మించి ఐదేళ్ళపాటు అధికారాన్ని చెలాయించి ఓటమి పాలైన వైసీపీ జిల్లా కార్యాలయం అక్రమంగా నిర్మించడంతో అదికాస్తా చాన్నాళ్ళ క్రితమే మూతపడింది. ఉన్న కార్యాలయంలోను ఒకరో ఇద్దరికి మాత్రమే పరిమితమైంది. ఆహా.. రోజులు మారతాయంటే ఇదే కదా.

-ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి



వసంతమహల్ సెంటర్ సమీపంలోని కాంగ్రెస్ కార్యాలయం



కలెక్టర్‌కు పూలమొక్కను అందిస్తున్న నూతన డీఆర్వో విశ్వేశ్వరరావు

డీఆర్వో బాధ్యతల స్వీకరణ

ఏలూరుసిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారిగా నియమితులైన వి.విశ్వేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్‌గా పని చేసిన విశ్వేశ్వరరావు జిల్లా డీఆర్వోగా బదిలీపై వచ్చారు. సోమవారం కలెక్టర్ వెట్రిసెల్విని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

250 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నూజివీడు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా పరిధిలో 3.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంతో 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా తెలిపారు. నూజివీడులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'జిల్లాలో 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందనే అంచనా. ఉంగుటూరు మండలం చేబ్రోలులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతులకు నగదు జమ చేస్తాం. ఈనెల 30న కౌలు రైతు ముసాయిదా చట్టం ఏర్పాటుకు సేకరణ నిర్వహించనున్నాం' మని తెలిపారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు, చిత్రంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

గిరిజనులు నష్టపోకుండా చూస్తాం..

- వంకవారిగూడెం గ్రామసభలో ఎమ్మెల్యే బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం
- నేవీ ఆయుధ డిపో వద్దంటూ గిరిజన సంఘాల వినతి పత్రం

జీలుగుమిల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : 'వంకవారిగూడెంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు వల్ల ఈ ప్రాంత ప్రజలకు మేలు కలుగుతుందనే ఉద్దేశంతోనే ఇక్కడ నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేసేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేస్తోంది. గిరిజనులకు కలిగే లాభనష్టాల్ని ఎంపీ, కేంద్ర ప్రభుత్వం, అధికారులతో చర్చిస్తాం. ఎవరికి నష్టం జరగకుండా చూస్తా'మని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. సర్పంచ్ కుంజా పార్వతి ఆధ్వర్యంలో సోమవారం నేవీ ఆయుధ డిపో ఏర్పాటు విషయమై చర్చించి పంచాయతీలో తీర్మానం చేసేందుకు గ్రామ సభ నిర్వహించారు. గిరిజన నాయకులు తెల్లం దురారావు, మడకం వెంకటేశ్వరావు మాట్లాడుతూ డిపో ఏర్పాటు వల్ల తాము ఉనికిని కోల్పోతామని, పోలవరం నిర్వాసితులకు జరిగిన అన్యాయం తమకూ జరుగుతుందన్నారు. తమ సమస్యలను వివరిస్తూ కేంద్రం దృష్టికి వెళ్లేలా చూడాలని వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. డిపోకు అనుకూలంగా సంతకాలు చేసేందుకు గిరిజనులు నిరాకరించారు. తహసీల్దారు బి.సందీప్, ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి, ఈవోపీఆర్డీ అఖిల్, కార్యదర్శులు వీరలక్ష్మి, దేవప్రియుడు పాల్గొన్నారు. కాగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరావు, ఎస్ఐలు నవీన్‌కుమార్, వి.చంద్రశేఖర్, జయబాబు నేతృత్వంలో భద్రతా ఏర్పాట్లు చేశారు. ఏఆర్ సిబ్బందిని, పోలవరం డివిజన్ పరిధిలో పోలీసులను నిఘాగా ఉంచారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

కలెక్టర్ వెట్రిసెల్వి.. 238 వినతుల స్వీకరణ

ఏలూరు రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 238 వినతులు స్వీకరించారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో పుష్పమణి, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజులతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల వినతుల స్వీకరణకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని డీఆర్వోను ఆదేశించారు.

అక్రమాలపై విచారణ చేయించాలి ..

వైసీపీ ప్రభుత్వ హయాంలో దెందులూరు నియోజకవర్గంలోని బీసీ కార్పొరేషన్, పలు ప్రభుత్వశాఖల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన అప్పటి ప్రజాప్రతినిధులను, అవినీతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కలెక్టర్ వెట్రిసెల్వికి విజ్ఞప్తి చేశారు. తనవంతు వచ్చేవరకు క్యూలో నిల్చుని ఆపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ కిశోర్

చేతబడులను నమ్మవద్దు : ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చేతబడులనే మూఢనమ్మకాలను ప్రజలు నమ్మవద్దని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ప్రజలకు సూచించారు. ప్రతి సోమవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 53 ఫిర్యాదులను ఏఎస్పీ సూర్యచంద్రరావుతో కలసి ఎస్పీ స్వీకరించారు. ప్రభుత్వ ఉద్యోగాలంటూ దళారులు మాటలు నమ్మి మోసపోవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

టీడీపీ నాయకుడు గోవర్ధన్‌పై చర్యలు తీసుకోండి

కలెక్టరేట్ వద్ద జనసైనికుల ధర్నా.. ఎస్పీకి వినతిపత్రం

ఏలూరు రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రుకు చెందిన టీడీపీ నాయకుడు సైదు గోవర్ధన్ ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, దెందులూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ ఘంటసాల వెంకటలక్ష్మిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై జనసేన నాయకులు భగ్గుమన్నారు. తక్షణం అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు ఇళ్ల శ్రీనివాస్, దెందులూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి తాతిపూడి చందు, ముత్యాల రాజేష్ తదితరులు మాట్లాడుతూ అసత్య ఆరోపణలతో పాటు వైసీపీ నాయకులను జనసేనలో చేర్చుకుంటున్నామంటూ దుర్భాషలు ఆడడం తగదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉండి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం వెనుక ఎవరు ఉన్నారో తేలాల్సి ఉందన్నారు. జనసేన నాయకులు, ఏలూరు ఎంపీపీ పి.శ్రీనివాస రాజు, ఎం.కృష్ణ, జి.సురేష్, పి.దుర్గా ప్రసాద్, విద్యాసాయి పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న జనసేన నాయకులు

నవంబరు మొదటివారంలో నైపుణ్య గణన

ఏలూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నవంబరు మొదటి వారం నుంచి జిల్లాలో నైపుణ్య గణన (స్కిల్ సెన్సస్)ను చేపట్టనున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి వెల్లడించారు. ఈ గణనకు సంబంధించి జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక సెయింట్ గ్జేవియర్స్ హైస్కూలు సమీపంలోని జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో ప్రతీ మండలం, మునిసిపాలిటీ నుంచి ఎంపికైన ఇద్దరు సిబ్బందికి జిల్లాస్థాయి శిక్షణ నిస్తారని, తిరిగి వీరంతా ఆయా మండల, మునిసిపాలిటీల్లో ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్ల నేతృత్వంలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి స్కిల్ సెన్సస్‌పై శిక్షణనిస్తారన్నారు. జిల్లాలో నివసించే 15-59 ఏళ్ల వయస్సువున్న నైపుణ్యంగల వ్యక్తుల వివరాలు సేకరించడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపర్చేందుకు పరిశ్రమల వివరాలు, మానవ వనరుల వివరాలతో తగిన ప్రణాళికలు రూపొందించడానికి సెన్సస్ డేటాను వినియోగిస్తామన్నారు.

'నవంబరు పింఛన్ల పంపిణీకి సిద్ధం కండి'

ఏలూరు రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): నవంబరు పింఛన్ల పంపిణీకి సంబంధించి ఈనెల 30న సిబ్బంది బ్యాంకు నుంచి సొమ్ములు డ్రాచేసి పంపిణీకి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. వివిధశాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో పింఛన్ల పంపిణీ, స్కిల్‌సెన్‌సెస్, పీఎం విశ్వకర్మ యోజన, సచివాలయ సర్వీసులు అంశాలపై సమీక్షించారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు పాల్గొన్నారు.

మునిసిపల్ టీచర్లకు తీపికబురు



కూటమి ప్రభుత్వం పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తీపికబురు అందించింది. ఏళ్ళ తరబడి బదిలీలు, పదోన్నతుల కోసం డిమాండ్ చేస్తున్న వారి ఆకాంక్షలకు కార్యరూపమిస్తూ నిర్ణయం తీసుకుంది.

మాకు రక్షణ కల్పించండి..



పెదవేగి మండలం కవ్వగుంటలో సోమవారం స్థానికేతరులైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వందమందికి పైగా తమకు స్థానికుల నుంచి రక్షణ కల్పించాలంటూ రహదారిపై ధర్నాకు దిగారు.-7లో

అవీ..ఇవీ

అయ్యప్ప భక్తుల అవస్థలు



ఇసుక తిన్నెల్లో కాలికి సిమెంటు సంచులతో అయ్యప్ప భక్తులు

నేత్రాలు సూడరో శివుడో శివుడా.. శివమెత్తి ఆడరో శివుడో శివుడా...? ఇసుక తిన్నెల్లో అయ్యప్ప స్వాములు ఏంటి.. కాళ్లకు సిమెంటు సంచులేంటి ? అనుకుంటున్నారా.. సోమవారం పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి తూర్పుగోదావరి జిల్లా దుళ్ల గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు యాభై మందివచ్చారు. ఆలయంలో అర్చనలు అభిషేకాలు పూర్తయ్యేసరికి మధ్యాహ్నం ఒంటి గంటయ్యింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం వడి కార్యక్రమాలకు ముందు స్నానాలాచరించేందుకు గోదావరి నదికి వచ్చి స్నానాలు చేశారు. ఇసుకతిన్నెల్లో నడక సాగిస్తున్న తరుణంలో ఎండతీవ్రతకు అరికాళ్లు మంటలెక్కాయి. ఆ ఇసుక తిన్నెల్లో వేడికి తాళలేక శివతాండవం చేశారు. ఇక చేసేదేం లేక నది తీరం ఒడ్డున ఇసుక బస్తాల సంచులు కాలికి తగిలించుకుని ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు.

- పోలవరం

పాలకోడేరులో అమెరికా పావురాలు..



ఇటీవల ప్రతీ ఒక్కరికి జంతువుల ప్రేమ పెరిగింది. కుక్కలు, పిల్లులు, కుందేళ్లను పెంచుకుంటున్నారు. అదేవిధంగా పక్షులను పెంచుకునేందుకు ఇష్టపడుతున్నారు. కుటుంబ సభ్యులతో సమానంగా వాటిపై కూడా ప్రేమ, ఆప్యాయతలను కనబరుస్తున్నారు. పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలోని కంకిపాటి జోసఫ్‌రాజు ఇంట్లో పావురాలను పెంచుకుంటున్నారు. సుమారు నాలుగు నెలల క్రితం తణుకులో రెండు పావురాలను రూ.3 వేలకు కొన్నారు. ఈ పావురాలు కూడా ఎక్కడికి వెళ్లకుండా కుటుంబ సభ్యులతోనే ఉంటున్నాయి. వీటిని అమెరికా పావురాలు అంటారని ఇవి అందరితో కలిసిపోతాయని ఎవరు దగ్గరకు తీసుకున్నా వస్తాయని ఆయన చెప్పారు. వీటికి ఆహారంగా పెసలు, కొర్రలు, సామలు, వంటివి పెడుతున్నారు. పావురాలు అంటే ఎంతో ఇష్టమని అందుకే పెంచుకుంటున్నామని తెలిపారు.

-పాలకోడేరు

ఆ కుటుంబంలో అంతా ప్రజా ప్రతినిధులే..



సర్పంచ్‌గా చేసిన పసుమర్తి ప్రభాకరరావు, ఆయన భార్య ప్రస్తుత సర్పంచ్ రాజేశ్వరి, కుమారుడు మధుబాబు

అవకాశవాద రాజకీయాలు రాజ్యమేలుతున్న నేటి రోజుల్లో ప్రజలకు మంచి చేస్తే ఎప్పటికి మరచిపోకుండా నెత్తిన పెట్టుకుంటారని చెప్పేందుకు ఆ కుటుంబమే నిదర్శనంగా నిలుస్తుంది. దెందులూరు మండలం జోగన్నపాలెం పసు మర్తి కుటుంబంలో తాత, కొడుకు, కోడలు, మనవడు ఇలా వరుసగా ప్రజా ప్రతినిధులుగా సేవ చేస్తూ ఇప్పటితరం రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి మామగారు దివంగత పసుమర్తి నాగభూషణం జోగన్నపాలెం సర్పంచ్‌గా మూడు పర్యాయాలు అంటే 15 సంవత్సరాలు పాటు ఏకగ్రీవ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన భీమడోలు సమితి వైస్‌చైర్మన్‌గా పని చేశారు. ఆయన అనంతరం వారి కుమారుడు పసుమర్తి ప్రభాకర్‌రావు 1988 సంవత్సరం నుంచి 5 సంవత్సరాలు సర్పంచ్‌గా పనిచేశారు. రెండు సంవత్సరాల పాటు ఎన్నికలు నిర్వహించక పోవడంతో 1995 వరకూ ఆయనే సర్పంచ్‌గా ఉన్నారు. ప్రభాకర్ భార్య పసుమర్తి రాజేశ్వరి 2006 సంవత్సరం నుంచి 2011 వరకూ సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం కూడా ఆమే సర్పంచ్‌గా ఉన్నారు. వీరి కుమారుడు మధుబాబు ప్రస్తుతం టీడీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా జోగన్నపాలెం సహకార సంఘం బ్యాంకు అధ్యక్షుడుగా పనిచేశారు. వీరి మావయ్య సీతంపేట సహకార బ్యాంకు అధ్యక్షుడిగా సుంకర రామచంద్రావు రెండు సార్లు బ్యాంకు అధ్యక్షుడిగా పని చేశారు. మాట ఇస్తే ఎంత కష్టమైనా, నష్టమైనా పని చేస్తారని ప్రజల్లో ఉన్న నమ్మకమే వారిని ప్రజా జీవితంలో ఉండేలా చేస్తోంది.

-దెందులూరు



కొడమంచిలి మేడకు వందేళ్ల పండుగ

ఆచంట మండలం కొడమంచిలిలో వందేళ్లు దాటినా చెక్కు చెదరకుండా అందరినీ ఆకర్షి స్తోంది. రెండు అంతస్థులు కలిగిన అందమైన ఈ భవనాన్ని అప్పట్లో గ్రామంలో అంతా చార్మినార్ అని పిలిచేవారు.. గ్రామానికి చెందిన జమీందార్‌గా పిలవబడే మన్నె సత్యనారాయణ మూర్తి 1923లో వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన మెటీరియల్ , బర్మా నుంచి తెచ్చిన టేకుతో ఇంటిని నిర్మించారు. ఇప్పటి వరకు నాలుగు తరాలు వారు ఇందులో నివాసం ఉండగా నేటికీ భవనం చెక్కు చెదరలేదు. ఇటీవలే వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ భవనానికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఈ భవనంలో మొత్తం రెండు అంతస్థులు కలిపి పది గదులు, మూడు హాల్లు ఉన్నాయి. వేసవి కాలంలో ఈ ఇంట్లో చల్లగానే ఉండటం విశేషం. మొదటితరం జమీందార్‌గా పిలువబడే మన్నె సత్యనారాయణ మూర్తి కొడమంచిలితో పాటు వివిధ ప్రాంతాలను కూడా పరిపాలించేవారని చెబుతుంటారు. వీరి కుటుంబ సభ్యుల్లో అనేక మంది గ్రామానికి కొన్నేళ్లపాటు సర్పంచ్‌లుగా, సొసైటీల అధ్యక్షులుగా పనిచేశారు. ఈ కుటంబానికి చెందిన వారే నరసాపురంలో ఒక సత్రం కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటికి నరసాపురంలో ఉంది. ఈ కుటుంబ సభ్యులు ఎక్కువగా రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణం వంటి నగరాల్లో వ్యాపారం నిమిత్తం స్థిరపడ్డారు. ఇప్పటికే ఆచంటలో వందేళ్ళు కలిగిన అందమైన గంధర్వ మహల్ ఉంది. ఇటీవలే ఈ భవనాకి కూడా వందేళ్ల పండుగ చేశారు.



-ఆచంట

గేట్ పరీక్షలపై అవగాహన

నూజివీడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలో హయ్యర్ ఎడ్యుకేషనల్ సెల్ ఆధ్వర్యంలో గేట్, ఐఈఎస్ పరీక్షల నిర్వహణపై మేడ్ ఈజీ సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంస్థ సీనియర్ ఫ్యాకల్టీ జితేంద్ర తివారీ, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లలో తరగతుల నిర్వహణపై వివరించారు. హయ్యర్ ఎడ్యుకేషనల్ సెల్ ఇన్‌చార్జ్ ఎం.రామకృష్ణ, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్, ఏవో బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు బస్సులు

నూజివీడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పంచారామాల దర్శనానికి నూజివీడు ఆర్టీసీ బస్ డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డీఎం సూర్య పవన్‌కుమార్ తెలిపారు. నవంబరు 3వ తేదీ రాత్రి 9 గంటలకు బయలుదేరే సూపర్ లగ్జరీ బస్సు మరునాడు రాత్రి 10 గం టలకు నూజివీడు చేరుతుందన్నారు.బస్సు నవంబరు 10, 17, 24 తేదీల్లో కూడా అందు బాటులో ఉంటుం దని, 20 మందికి మించి ప్రయాణికులు ఒకేచోట టిక్కెట్ బుక్ చేసుకుంటే బస్సు వారి వద్దకే వస్తుందన్నారు

తలరాతను మారుద్దాం



ప్రస్తుతం మనం ఉంటున్న నేల.. పీలుస్తున్న గాలి.. తింటున్న ఆహారం అన్నీ కలుషితమవుతున్నాయి. మారిన కాలంతో పాటు ఆహార అలవాట్లు మారాయి. రసాయన మిళిత ఆహారాలు మన సహజ ఆరోగ్యాన్ని దెబ్బతీసి వయసుతో సంబంధం లేకుండా కుంగదీస్తున్నాయి. వీటితో పాటు మానసిక ఒత్తిడి, రుగ్మతలు బ్రెయిన్ స్ట్రోక్‌కి కారణమవుతున్నాయి. అక్టోబరు 29 వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే సందర్భంగా బ్రెయిన్ స్ట్రోక్ గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం.. బ్రెయిన్ స్ట్రోక్ బారిన ఎవరూ పడకుండా జాగ్రత్త పడదాం. - పోలవరం

మెదడుకి రక్తాన్ని సరఫరా చేసే మెదడు రక్తనాళాలపై ప్రభావం చూపే బ్రెయిన్ స్ట్రోక్‌ని వైద్య పరిభాషలో సెరెబ్రో వాస్కులర్ డిజార్డర్ అంటారు..దానినే మనం పక్షవాతం అని పిలుస్తాం. బ్రెయిన్ స్ట్రోక్‌లలో కూడా రెండు రకాలు ఉన్నాయి. నలుగురిలో ఒకరికి వారి జీవిత కాలంలో స్ట్రోక్ వచ్చే అవకాశాలున్నాయి. మెదడుకి రక్త సరఫరా తగ్గడం ప్రధానంగా రెండు కారణాల వల్ల జరుగుతుంది ఒకటి రక్తం గడ్డకట్టడం దీనిని వైద్య పరిభాషలో ఇస్కీమిక్ స్ట్రోక్ అంటారు. మరొకటి మెదడులో రక్తస్రావం..దీనిని వైద్య పరిభాషలో హెమరేజిక్ స్ట్రోక్ అని అంటారు. మెదడు సరిగా పనిచేయడానికి అవసరమయ్యే ఆక్సిజన్ పోషకాల సరఫరాకు అంతరాయం కలగడం వల్ల శరీరంలో వచ్చే మేజర్ ఆరోగ్య మార్పులే పక్షవాతం. ఆక్సిజన్ లేదా రక్తం సరఫరా లేకపోవడం వలన కేవలం కొన్ని నిమిషాలు మెదడు కణాలు పనిచేయకపోవడం, క్షీణించడం వల్ల మెదడు ప్రభావితమై శరీర భాగాలకు రక్త సరఫరా నిలిచి పోవడం తద్వారా శరీర భాగాలు చచ్చుబడడం జరుగుతుంది. మెదడులో రక్త నాళం పగిలినప్పుడు సంభవించే అత్యవసర పరిస్థితి స్ట్రోక్ అని చెప్పవచ్చు. ఈ స్ట్రోక్ మెదడుకి శాశ్వత నష్టం లేదా దీర్ఘకాలిక వైకల్యం లేదా కొన్ని సందర్భాలలో మరణం కూడా సంభవించవచ్చు.

లక్షణాలు ఇవీ..



- ముఖం చేయి లేదా కాలు ముఖ్యంగా శరీరంలో ఒకవైపున ఆకస్మిక తిమ్మిరి లేదా బలహీనత
- ఆకస్మిక ఆందోళన, మాట్లాడంలో ఇబ్బంది నాలుక మడతపడడం
- మాటలు వినిపించుకోవడం, అర్థం చేసుకోవడంలో ఇబ్బంది.. ఒకటి లేదా రెండు కళ్ళతో చూడడంలో ఇబ్బందులు
- తల తిరగడం , నడకలో మార్పు, సమతుల్యత కోల్పోవడం, సూచనలకు స్పందించలేకపోవడం
- వాంతులు లేదా అపస్మారక స్థితికి చేరుకోవడం.. అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మారిన ఆహార అలవాట్లతో రోగాలు
మెదడు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
సుగర్, బీపీ అదుపులో ఉంచుకోవాలి
ఈ ఏడాది ఇప్పటివరకు 1300 పైగా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు నమోదు

ఎవరికి వస్తుంది

హైపర్ టెన్షన్ అని పిలవబడే అధిక రక్తపోటుని బీపీ అంటారు. బీపీ మెదడుకి రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు దెబ్బతినడానికి కారణమవుతాయి. అదుపు తప్పిన బీపీ కూడా స్ట్రోక్‌కి కారణమవుతుంది. షుగర్ రోగుల్లో కూడా రక్త నాళాల్లో సంభవించే మార్పుల వల్ల స్ట్రోక్ వస్తుంది. ధూమపానం చేయని వ్యక్తులతో పోల్చినప్పుడు ధూమపానం చేసేవారిలో ఇస్కీమిక్ స్ట్రోక్ సంభవించే ప్రమాదం రెట్టింపు ఉంటుంది. హైపర్ బ్లడ్ కొలెస్ట్రాల్ వల్ల రక్త నాళాలను కుంచించుకుపోయి మెదడు రక్త సరఫరాని తగ్గించడం వల్ల కూడా స్ట్రోక్ వస్తుంది. మరికొన్ని సందర్భాలలో లైంగిక సామర్థ్యాన్ని పెంచుందుకు వాడే నిషేధిత మందుల వాడకం వల్ల కూడా స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతాయి. బ్రెయిన్ స్ట్రోక్ సమస్యలలో ఒకటి సెరిబ్రల్ ఎడెమా అనబడే మెదడు వాపు..ఈ సమస్యలో మూర్ఛ వచ్చి అపస్మారక స్థితి కలుగుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా ఏటా 1.5 కోట్ల మంది స్ట్రోక్‌తో బాధపడుతున్నారు. వారిలో 50 లక్షల మంది మృత్యువాత పడుతున్నారు. మరో 50 లక్షల మంది శాశ్వత వికలాంగులుగా మిగిలిపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు రెండవ కారణంగా బ్రెయిన్ స్ట్రోక్ నిలుస్తుంది. 65 సంవత్సరాల కంటే వయసు పైబడిన వారికే ఎక్కువగా స్ట్రోక్ వస్తుంది. పురుషులతో పోలిస్తే 60 శాతం స్త్రీలు స్ట్రోక్‌కి గురవుతున్నారు. వారిలోనే అధిక శాతం మరణాలు సంభవిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో ఈ ఏడాది 373 బ్రెయిన్ స్ట్రోక్ కేసులు నమోదు కాగా ప్రైవేటు ఆస్పత్రులలో సుమారు 900కి పైగా కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.

మెదడులో అసాధారణ విద్యుత్ చర్య వల్ల శరీరంపై నియంత్రణ కోల్పోతారు. మూత్ర విసర్జనపై నియంత్రణ లేకపోవడం వల్ల బ్యాగ్ అమర్చాల్సిన అవసరం వుంటుంది. న్యుమోనియా స్ట్రోక్‌తో బాధపడేవారిలో ఊపిరితిత్తుల్లోకి ఆహారం పీల్చబడి ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ వస్తుంది. శరీర భాగాలపై నిరంతర ఒత్తిడి కారణంగా చర్మంపై బెడ్‌సోర్స్ అనబడే పుండ్లు ఏర్పడవచ్చు. క్లినికల్ డిప్రెషన్, ఆస్పత్రి వాతావరణం, మందుల వాసన, నిరంతర విచారం, మానసిక ఒత్తిడి వంటి అనుభూతి కలుగుతుంటుంది.

వచ్చిన వెంటనే ఏం చెయ్యాలి

24 నుంచి 48 గంటల్లో మెదడు, నరాల స్పెషలిస్టు , న్యూరాలజిస్టుని సంప్రదించి వైద్య సేవలం దించడం వల్ల మెరుగైన ఫలితాలుంటాయి. స్ట్రోక్ చికిత్సలో మందులు లేదా ఆపరేషన్ ప్రక్రియలు ఉంటాయి. స్ట్రోక్ కేర్, న్యూరో ఎండో వాస్కులర్ విధానాలలో ప్రత్యేక శిక్షణ పొందిన న్యూరాలజిస్టులను వైద్య సేవల కోసం ఎంచుకోవడం మంచిది.

నివారణ చర్యలు

ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, రెగ్యులర్ హెల్త్ చెకప్‌ల ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌ని నివారించవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం తీసు కోవాలి. అధిక కొవ్వులు కలిగిన ఆహారాలు మాని సాచురేటెడ్ ఫ్యాట్స్ కలిగిన, ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఉప్పు,చక్కెర వాడకం తగ్గించాలి చురుకైన నడక లేదా రెండున్నర గంటల ఏరో బిక్ ఫిజికల్ యాక్టివిటీ ద్వారా శరీరంలో ఉన్న అదనపు కొవ్వులను కరిగించే వ్యాయామాలు కనీసం వారానికి ఒకసారన్నా చేయాలి. బీపీ, సుగర్‌లను అదుపులో ఉంచుకోవడం , రెగ్యులర్ చెకప్‌లు చేసుకోవడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవకుండా చూసుకోవచ్చు.

అలంపురం ట్రస్టులో ఉచిత న్యూరో సేవలు

పెంటపాడు : పెంటపాడు మండలం అలంపురం శ్రీవెంకట రమణా సేవా చారిటబుల్ ట్రస్టు ఆసుపత్రికి ప్రతీ నెల మూడో ఆదివారం ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ తీగల రమేష్ విచ్చేస్తారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. దీనికి సంబంధించి రక్తపరీక్షలు, అవసరమైన ఇతర పరీక్షలు కూడా ఆసుపత్రిలోనే ఉచితంగా చేస్తారు.వచ్చేనెల 17న ట్రస్టుకు రమేష్ వస్తారని ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

మార్టేరులో ముగిసిన అండర్-17 పోటీలు

పెనుమంట్ర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :పెనుమంట్ర మండలం మార్టేరులో జరిగిన 69 స్కూల్ గేమ్స్ అండర్-17 బాల బాలికల బాస్కెట్ బాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. బాలికల విభాగంలో కృష్ణ, పశ్చిమ గోదావరి జట్ల మధ్య జరిగిన పోటీలో కృష్ణా జిల్లా గెలుపొందగా తూర్పుగోదావరి అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో తూర్పు గోదావరి విజయం సాధించింది. బాలుర విభాగంలో కృష్ణా నెల్లూరు జట్ల మధ్య జరిగిన పోటీలో కృష్ణాజిల్లా విజయం సాధించగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జట్ల మధ్య సాగిన పోటీలో పశ్చిమ గోదావరి జిల్లా గెలుపొందింది. క్రీడా స్ఫూర్తి పెంపొందించే విధంగా క్రీడాకారులు రాణించాలని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర జాతీయ అంత ర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు పతకాలు సాధిం చే దిశగా వ్యాయామ ఉపాధ్యాయులు తరఫున ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ తాను క్రీడాకారుడు నేనని మార్టేరులో ప్రతి ఇంట్లోనూ ఒక బాస్కెట్ బాల్ ప్లేయర్ ఉంటారని క్రీడా పోటీలకు వేదికనిచ్చే మార్టేరు క్రీడాకారులను ప్రోత్సహి స్తుందని చెప్పారు. విజేతలకు ట్రోఫీలను అంద జేశారు. రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ బాల,బాలికల విభాగం జట్లను ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి టీఎస్ఎన్ మల్లేశ్వరరావు, బాస్కెట్‌బాల్ పరిశీలకుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి జి.చక్రవర్తి, పీవీఆర్ ట్రస్టు చైర్మన్ సూర్యనారాయణ, జాన్సన్, పీడీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన కృష్ణా జిల్లా బాలుర జట్టు



రన్నర్‌గా నిలిచిన పశ్చిమ గోదావరి జిల్లా బాలుర జట్టు



బాలికల్లో రన్నర్‌గా నిలిచిన తూర్పుగోదావరి జట్టు

స్విమ్మింగ్ పోటీల్లో పశ్చిమ పోలీసులకు మెడల్స్

భీమవరం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో ఈనెల 27వ తేదీ ఆదివారం జరిగిన 5వ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ ఆక్వా టిక్ ఛాంపియన్‌షిప్ 2024 స్విమ్మింగ్ పోటీలలో పశ్చిమ గోదావరి జిల్లా పోలీస్‌శాఖ తరుపున హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్ళకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. డీసీఆర్‌బీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ 400 మీటర్ల ఫ్రీస్టైల్‌లో గోల్డ్ మెడల్, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. తాడేపల్లిగూడెం టౌన్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్ 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో గోల్డ్ మెడల్ అలాగే 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న యస్ శ్రవణ్‌కుమార్ 100 మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్లో సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని ఎస్పీ నయీం అస్మి, అదనపు ఎస్పీ భీమారావు అభినందించారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురికి మంచి భవిష్యత్ ఉందని ముందు ముందు ఇంకా గొప్ప విజయాలు సాధించి పోలీస్‌శాఖకు పేరు తేవాలని ఎస్పీ ఆకాంక్షించారు.



గోల్డ్ మెడల్స్ సాధించిన పోలీసులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

స్పోర్ట్స్ కాలమ్



యువజనోత్సవాలకు ఎంపికైన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు ఎస్‌కేఎస్‌డీ విద్యార్థినులు

తణుకు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు పలువురు వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీ సుందరీబాయ్ తెలిపారు. జానపద గీతం గ్రూపులో బి.షణ్ముఖేశ్వరి ప్రథమ, సోలో ఎ.ఝాన్సీ ప్రథమ, జానపద నృత్యం సోలో కె.ఖ్యాతేశ్వరి ప్రథమ, కవిత్వంలో కె.వెంకట రమ్య ప్రథమ, ఉపన్యాసంలో కె.వెంకటరమ్య ప్రథమ, స్టోరీ రైటింగ్‌లో ఎ.రాణి క్యాథరిన్ ప్రథమ, సైన్సు అండ్ ఇన్నోవేషన్స్‌లో లలిత అండ్ గ్రూపు ప్రథమ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. విజేతలను చిట్టూరి వెంకట కృష్ణారావు, అభినందించారు.



ఖోఖో పోటీలకు సిద్ధం చేస్తున్న మైదానం

నేడు కైకరంలో ఖోఖో జిల్లా జట్టు ఎంపిక

ఉంగుటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్తు పాఠశాల మైదానంలో మంగళవారం జిల్లా ఖోఖో జట్టు ఎంపిక పోటీలు జరుగుతాయని హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు తెలిపారు. సోమవారం హైస్కూల్‌లో మూడు మైదానాలను సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ క్రీడలకు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.నాగసుధ వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని 650 మంది క్రీడాకారులతో పాటు 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారని వివరించారు.

పొరుగింటి కర్రీ రుచి

బంధువులు వస్తే కర్రీ పాయింటే దిక్కు




"కర్రీ పాయింట్‌లలో మూడు రకాల కూరలు తీసుకుంటే రూ.50 నుంచి రూ.70వరకు అవుతుంది. రూ.100కు ఒక్కపూట భోజనం రావడమే కష్టం. పెరిగిన కూరగాయల ధరల కన్నా కర్రి పాయింట్‌లలోనే తక్కువ ధరకు వస్తాయి. బంధువులు వచ్చిన సమయాల్లో కర్రి పాయింట్ కూరలు బెస్ట్..అని దుగ్గిరాలకు చెందిన రాజ్యలక్ష్మి చెప్పారు..

కూరగాయలు కొనలేని పరిస్థితి ..



"సాంబారు, రసం, పప్పు, ఇతర కూరలు రూ.50లకే వస్తున్నాయి. ఒక్కోసారి ఇంట్లో వంట చేసుకోలేని పరిస్థితి. కర్రీపాయింట్ అక్షయ పాత్రగా మారుతుంది. ఉద్యోగ రీత్యా ఒక్కోసారి వంట చేయటం కష్టంగా మారు తోంది. డ్యూటీకి వెళ్లినప్పుడు ఒక్కోసారి కర్రీ పాయింట్ల నుంచే కూరలు కొనేస్తాను.."అని చెబుతున్నారు శనివారపుపేటకు చెందిన సునీత..

ఉరుకుల పరుగుల జీవితంలో వండుకుని తినేంత టైమ్ ఉండడం లేదు. ప్రశాంతంగా తినే సమయం అసలే లేదు. దీంతో ఎక్కడికక్కడే కర్రీ పాయింట్స్ వెలిశాయి. చేసుకుని తినే ఓపిక లేనివారు వీటిని ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడున్న రేట్లకు కర్రీ పాయింట్ కూరలే బెస్ట్ అని అంటున్నారు. మధ్యాహ్నం అయితే పట్టణాలు, పల్లెల్లో సైతం కర్రీ పాయింట్లు కిటకిటలాడుతున్నాయి. ఒక రకంగా చూస్తే ఇవి పలువురికి ఉపాధి మార్గాలుగా కూడా మారాయి. గతంలో అన్నిరకాల కూరలు వంటింట్లో చేసుకుని తినేవారు. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో ఎవరికీ వండుకుని తినేంత టైమ్ కూడా ఉండటం లేదు. అమ్మచేతి వంటను కాదని ఇప్పుడు తక్కువ ధరకే వస్తున్నందున కర్రీ పాయింట్ల వెంట పరిగెడుతున్నారు. తమకు వీటి ద్వారా ఉపాధి దొరికిందని పలువురు మహిళలు తెలుపుతున్నారు. కర్రీస్ పాయింట్స్‌లో మాంసాహారం, శాఖా హారంకు సంబంధించిన కూరలు వేరువేరుగా విక్రయిస్తున్నారు. రూ.20 నుంచి కూరలు అందిస్తున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో అధికంగా కొనుగోళ్ళు జరుగుతున్నాయని యజమానులు చెబుతున్నారు. పలు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, రోజుకూలీలకు కర్రీ పాయింట్లు వరంగా మారాయి. 20 నుంచి 40 వరకు వెరైటీలు అమ్మకాలు చేస్తున్నారు. కర్రీపాయింట్ల వల్ల అధిక శాతం ఉద్యోగస్తులు ఇళ్లల్లో వంటలు చేయడమే మానేశారని పలువురు ఉద్యోగులు ర్కొన్నారు. ఇంట్లో వండితే ఒకటే కూర.. కర్రీ పాయింట్లో రెండు, మూడు రకాలు తినవచ్చు అనడం విశేషం. - ఏలూరు రూరల్





ఏలూరులో కర్రీ పాయింట్

భళా.. బాల మేధావులు

- నమూనాలు తయారు చేసిన గురుకులం విద్యార్థులు
- నువ్వా.. నేనా అంటూ అదరగొట్టిన చిన్నారులు
- ద్వారకాతిరుమలలో ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

ద్వారకాతిరుమలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ విజ్ఞానదాయకంగా ఉన్నది. పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇది ఎంతగానో తోడ్పడుతుంది. విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సోమవారం జరిగిన ప్రదర్శనలో పలు జిల్లాలలోని గురుకులం పాఠశాలల నుంచి సీనియర్, జూనియర్ విభాగాల్లో మొత్తం 114 మంది విద్యార్థులు 58 ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. గురుకులం పశ్చిమ, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల సమన్వయకర్తలు ఎస్.భారతి, కె.ప్రేమావతి, జి.వెంకట్రావు, జడ్పీటీసీ శామ్యూల్, సర్పంచ్ సావిత్రి, ఎంఈవో వెంకట్రావు, పి.విజయభారతి తదితరులు ప్రదర్శనలు తిలకించి విద్యార్థులను అభినందించారు.

– ద్వారకాతిరుమల

సెన్సార్‌తో ఓటేద్దాం



ఓటు హక్కును ఎటువంటి భయం లేకుండా ఐఆర్ సెన్సార్ ద్వారా వినియోగించుకునే విధానాన్ని తెలియజెప్పేలా విద్యార్థులు రూపొందించారు. టాంపరింగ్‌లు లేకుండా మనం అనుకున్న వ్యక్తి గుర్తుపై చేయిపెడితే సెన్సార్ ద్వారా ఓటు నమోదు అవుతుంది. దీనిని వట్లూరు గురుకులం బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గంటా సుష్మ, పొన్నూరి చాందిని తయారు చేశారు.

భూగర్భ జలాలు పెంచేద్దాం..



ప్లాస్టిక్‌తో అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. సకల ప్రాణులు ప్లాస్టిక్‌తో ఇబ్బంది పడుతు న్నారు. భూమి పొరల్లో ప్లాస్టిక్ అడ్డుపడటం వల్ల భూగర్భ జలాలు పెరిగే పరిస్థితి లేదు. భూమిలోకి ప్లాస్టిక్‌ను నియంత్రించడంతోపాటు భూగర్భ జలాలను పరిరక్షించడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యం. మొక్కలను ఎక్కువగా పెంచాలని, ఫ్యాక్టరీల నుంచి వచ్చే కలుషిత నీరు నదుల్లోకి రావడం వల్ల అదే నీటిని వ్యవసాయానికి వినియోగిస్తే భూమి సారాన్ని కోల్పోయి పంట నష్టం కలుగుతుందని చెప్పారు. దీనిని కొవ్వూరు గురుకులంకు చెందిన జె అబిల, వై.దీవెన కుమారి రూపొందించారు.

మహిళా రక్షణపై



ద్వారకాతిరుమల గురుకులంలో చదువు తున్న భీమడోలు గుణశ్రీ, జీఎల్ఎస్ గౌతమి డెమో ఆకట్టుకునే విధంగా ఉన్నది. మహిళా సంరక్షణ చట్టాలు, బాలిక కనీస వివాహ వయస్సు అత్యవసర నెంబర్లు 181, 112, 100 పై వివరించారు. అలాగే 18 ఏళ్ల నిండకుండా బాలికకు వివాహం జరిపితే తల్లితండ్రులకు లేదా సంరక్షకులకు బాల్యవివాహ నిరోధ చట్టం ప్రకారం శిక్ష ఉంటుందని చెప్పారు. దీన్ని చూపుతూ డెమో ప్రదర్శించారు.



చెత్తను తెస్తే చాలు..

చెత్తకుండీకి అల్ట్రాసోనిక్ సెన్సార్‌ను అమర్చారు. చెత్తను వృద్ధులు, గర్భిణులు వంటి వారు పెద్దగా కష్టపడకుండా చెత్తను దాని దగ్గరకు తెస్తే అదంతట అదే ఓపెన్ అవుతుంది. చెత్తను అందులో వేసిన వెంటనే క్లోజ్ అవుతుంది. దీని ఖర్చు రూ.200 లోపే.. అని పామర్రులోని గురుకులంలో 8వ తరగతి చదువుతున్న మహ్మద్ అర్షప్ తయారు చేశాడు. దీనిని షాపింగ్ మాల్స్ ఆసుపత్రిలు, పాఠశాలల్లో వాడొచ్చు.

ఆకులపై బొమ్మలు



ఆకులు, పేపర్‌ప్లేట్‌లు, థర్మో కోల్, అరటి డొప్పలు, వేరుశెనగ తొక్కలు, ఖాళీ సీసాలు, ఐస్‌క్రీమ్ పుల్లలు వంటి వాటిని ఉపయోగించి అనేక బొమ్మలు తయారుచేశారు. తామరాకులపై అంబేడ్కర్, గౌతమబుద్ధుడు, గాంధీ, బోసు వంటి మహనీయుల చిత్రాలను లీఫ్ ఆర్ట్ పేరిట రూపొందించారు. ఖాళీ బాటిళ్లపై వివిధ ప్రకృతి చిత్రాలను గీచి అబ్బురపరిచారు. పేపర్‌ప్లేట్లను, వేరుశెనగ తొక్కలను వినియోగించి కళాత్మక చిత్రాలను వేశారు. వీటిని గోపాలపురంకు చెందిన విద్యార్థులు ఎం.సంజన, కె. గీతిక తయారుచేశారు.





ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి రామానాయుడు, అంగర

సభ్యత్వ నమోదులో పాలకొల్లు ముందుండాలి

మంత్రి రామానాయుడు

పాలకొల్లు టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం నమోదు ప్రక్రియను వేగవంతం చేసి రాష్ట్రంలోనే పాలకొల్లు నియోజకవర్గం ముందుండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం పాలకొల్లులో జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్డీయే బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని సమష్టిగా పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కేవలం రూ.100తో సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలందరికీ ఆర్థిక భరోసా కల్పించడం జరిగిందన్నారు. ఈసభలో ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి తదితరులు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల భద్రత, సంక్షేమం, ఆర్థిక భరోసా కల్పించడమే ధ్యేయంగా అధినేత చంద్రబాబునాయుడు సభ్యత్వ నమోదును గురుతర బాధ్యతగా తీసుకున్నారని వెల్లడించారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామభద్రరాజు, జిల్లా టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, పట్టణ, మండలాల అధ్యక్షులు జీవీ, మామిడిశెట్టి పెద్దిరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, కోడి విజయభాస్కర్, రాష్ట్ర టీడీపీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దాసరి రత్నరాజు, బీసీసెల్ కార్యదర్శి బందెల భాస్కరరావు, నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మునిసిపల్ టీచర్లకు ప్రమోషన్లు



ఏలూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తీపికబురు. ఏళ్ళతరబడి బదిలీలు, పదోన్నతుల కోసం డిమాండ్ చేస్తున్న మునిసిపల్ టీచర్ల ఆకాంక్షలకు కార్యరూపమిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆ మేరకు మునిసిపల్ టీచర్ల పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించాల్సిందిగా ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనికనుగుణంగా ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా ప్రాతిపదికగా ఏలూరుజిల్లా డీఈవో నేతృత్వంలో పదోన్నతుల ప్రక్రియను చేపట్టారు.

ఉమ్మడి జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్, నిడదవోలు, నరసాపురం, తణుకు, భీమవరం, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, పాలకొల్లు మునిసిపాలిటీల్లో మొత్తం 230 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుండగా, వీటిలో సుమారు 1400మంది టీచర్లు పని చేస్తున్నారు. కూటమిప్రభుత్వం కొలువుతీరాక చేపడుతున్న మెగా డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్‌లో మునిసిపల్ పాఠశాలలకు చెందిన టీచర్ పోస్టుల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ల నుంచి దాదాపు 260 వెకెన్సీలను చేర్చినట్లు సమాచారం. మెగా డీఎస్సీకి చేర్చినవాటిలో 2025 మే నెలాఖరు వరకు ఏర్పడే వెకెన్సీలను కూడా చేర్చగా, ఇపుడు మిగతా ఖాళీలకు మాత్రమే పదోన్నతులను ఇచ్చేఅవకాశం ఉంది. దీనిపై విద్యాశాఖ నుంచి స్పష్టత రావాల్సిఉంది. వర్కింగ్ ఎస్జీటీల నుంచి తగిన అర్హతలున్నవారికి ఆయా సబ్జెక్టుల్లో అందుబాటులోవున్న ఖాళీలమేరకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు ఇవ్వడంద్వారా భర్తీచేయనున్నారు. ఆ ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఏలూరు నగరపాలకసంస్థలో 7 హైస్కూళ్ళు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, భీమవరం మునిసిపాలిటీల్లో 6 చొప్పున, నరసాపురం 5, నిడదవోలు 3, తణుకు, కొవ్వూరు మునిసిపాలిటీల్లో ఒక్కొక్కటి చొప్పున హైస్కూళ్ళలో అందుబాటులోవున్న ఖాళీల మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతులు ఇవ్వడంద్వారా భర్తీచేస్తారు. జంగారెడ్డిగూడెం, ఆకివీడు మునిసిపాలిటీలుగా వర్గోన్నతి అయినప్పటికీ, ఇంతవరకు అక్కడి పాఠశాలలను మాత్రం పురపాలకశాఖ పరిధిలోకి రాష్ట్రస్థాయిలో తీసుకురాలేదు. మరోవైపు ఏలూరు కార్పోరేషన్ పరిధిలోకి పరిసర గ్రామాలను కూడా గతంలోనే చేర్చినప్పటికీ, సంబంధిత ప్రాంతాల్లోని స్కూళ్ళు మాత్రం పంచాయతీరాజ్ పరిధిలోనే కొనసాగుతున్నాయి. ఇక తాజాగా మునిసిపల్ పాఠశాలల టీచర్లకు ఇవ్వడానికి ఉద్దేశించిన పదోన్నతులు మెగా డీఎస్సీకి చేర్చిన పోస్టులను మినహాయిస్తే ఉమ్మడి జిల్లాలో సుమారు 14 వరకు మాత్రమే ఉంటాయని ప్రాథమిక అంచనా. ఈ పదోన్నతులు మునిసిపాలిటీ లవారీగా ఎన్నెన్ని ఉంటాయనేదానిపై ఒకటిరెండురోజుల్లో స్పష్టత రానుంది.

వచ్చే నెలలో ప్రమోషన్లు

అర్హులకు ప్రమోషన్లను నవంబరు మొదటి వారంలో ఇస్తారు. కాగా పదోన్నతుల ప్రక్రియ ప్రకారం ఉమ్మడిజిల్లాలోని మున్సిపల్ టీచర్ల సీనియార్టీ జాబితాలు సోమవారమే విడుదల కావాల్సిఉండగా, కొత్తగా బదిలీపై జిల్లాకు నియమితులైన ఎం.వెంకటలక్ష్మమ్మ ఇంకా బాధ్యతలు చేపట్టకపోవడంతో ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని జాబితాలను మంగళ లేదా బుధవారం విడుదలచేసే అవకాశం ఉంది. నూతన డీఈవో వెంకటలక్ష్మమ్మ జిల్లాలో బుధవారం విధుల్లో చేరతారని తెలిసింది.



కవ్వగుంటలో రహదారిపై ఆందోళన చేస్తున్న స్థానికేతరులు

భద్రత కరువైందని స్థానికేతరుల ఆందోళన

పెదవేగి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలు దాటి ఉపాధి కోసం వచ్చిన మాపై స్థానికంగా ఉండే కొంతమంది దాడులు చేస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారినుంచి రక్షణ కల్పించాలంటూ శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలకు చెందిన వ్యక్తులు రహదారిపై ఆందోళనకు దిగారు. పెదవేగి మండలం కవ్వగుంటలో సోమవారం ఉదయం స్థానికేతరులైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వందమందికిపైగా కవ్వగుంట రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సమయంలో రహదారిపై రాకపోకలు నిలిచిపోవడం, సమాచారం అందుకున్న పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ కె.రామకృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. అయితే ఆందోళన చేస్తున్న వ్యక్తులు మాత్రం ఎంతకూ పట్టు వీడకుండా తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని భీష్మించారు. రెండుగంటలకు పైగా నిరసన వ్యక్తంచేశారు. 40ఏళ్ళుగా ఇక్కడే ఉంటూ, కూలీపనులతో జీవనం సాగిస్తున్న మాపై గడచిన నాలుగేళ్ళుగా స్థానికులు దాడులు చేస్తున్నారని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై అలాంటి జరుగకుండా చూస్తామని పోలీసులు ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు.

మలేరియా సబ్ యూనిట్ అధికారి రాజ్‌కుమార్ మృతి

పాలకొల్లు రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నరసాపురం డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎం. రాజ్‌కుమార్ (56) గుండెపోటుతో సోమవారం ఆకస్మికంగా మరణించారు. రాజ్ కుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రాజ్ కుమార్‌కు గుండెపోటు రావడంతో ఆదివారం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రాజ్ కుమార్ మృతి పట్ల ఉమ్మడి జిల్లాల మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద రావు, జిల్లా ఇన్‌చార్జి డిఎంవో డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్, ఏఎంవోలు పి శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, లంకలకోడేరు పిహెచ్‌సి డాక్టర్ ప్రతాప్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

లింగపాలెం, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి):మద్యం మత్తులో తనను భర్త వేధింపులకు గురిచేస్తున్నాడంటూ భార్య ఫిర్యాదు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం ధర్మాజిగూడెం గ్రామానికి చెందిన కూరపాటి మారెమ్మను భర్త మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవటం లేదని తరచూ మద్యం తాగి తనని కొడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడంటూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రైమ్ కార్నర్

నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య

ఆగిరిపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేక నిద్రమాత్రలు మింగి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అడవినెక్కలంలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. కూలి పనులు చేసి జీవించే లక్ష్మి బాబు (43) కొంత కాలం నుంచి అనారోగ్యం కారణంగా సరిగా నిద్రపట్టక వైద్యుడి సూచనల మేరకు స్లీపింగ్ టాబ్లెట్లు వాడేవాడని 24న అధిక మోతాదులో నిద్రమాత్రలు మింగడం వల్ల అపస్మారక స్థితికి చేరుకోవడంతో విజయవాడ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 27న మృతి చెందాడన్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కుక్కునూరు, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన కొప్పుల నరేష్ (33) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుక్కునూరు ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నరేష్‌కి తన భార్య చెడుప్రవర్తన కలిగి ఉందని పలుమార్లు అనుమానించాడు. ఈ క్రమంలో ఆవేదనతో ఉరివేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి మృతి

ఉండి అక్టోబరు 28:(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ మహ్మద్ నజీరుల్లా అందించిన వివరాలు ప్రకారం.. పాందువ్వ గ్రామానికి చెందిన గుబ్బల సత్యనారాయణ(73) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దాంతో సోమవారం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు చూసేసరికే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కార్మికుడిపై కేసు

అత్తిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరిగేడు శివారు యర్రనీలి గుంట గ్రామానికి చెందిన పేసెట్టి దేవ కృష్ణ మోహన్ అనే వ్యక్తిని కొట్టాడనే ఆరోపణపై కొబ్బరి దింపు కార్మికుడు కడలి నాగ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్‌ఐ పి.ప్రేమరాజు తెలిపారు. రెండు రోజుల క్రితం నాగశ్రీనివాస్ కొబ్బరి దింపు కోసం వెళ్ళాడు. కృష్ణ మోహన్ రెండు వందల రూపాయలు బకాయి పడడంతో శ్రీనివాస్ గొడవపడి గాయపరిచాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండేళ్లుగా చోరీలు

ఎట్టకేలకు దొంగల పట్టివేత.. 66 గ్రాముల బంగారం స్వాధీనం



నిందితులను చూపిస్తున్న భీమవరం డీఎస్పీ జయసూర్య

భీమవరం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాలుగా ఆకివీడు పోలీస్ స్టేషన్ పరిధిలో తాళాలు వేసిన ఇళ్ళల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను, అలాగే వారు దొంగిలించిన వస్తువులను కొనుగోలు చేస్తున్న ఒక కంపెనీ అసిస్టెంట్ మేనేజర్‌ను అరెస్టు చేసినట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆకివీడు రైల్వేస్టేషన్ రోడ్‌కు చెందిన ఆవాల వెంకన్నబాబు, జవహర్ పేటకు చెందిన వాన లక్ష్మణరావు కలిసి సుమారు 15 దొంగతనాల కేసుల్లో నిందితులుగా ఉన్నారు. సోమవారం ఆకివీడు ఎస్‌ఐ హనుమంతు నాగరాజు వెంకయ్యవయ్యేరు బ్రిడ్జి సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా వారిద్దరూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రెండు కేసుల్లో సుమారు 66 గ్రాముల బంగారు ఆభరణాలు నేరానికి ఉపయోగించే పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. ఆవాల వెంకన్నబాబు గతంలో ఒక ఏఎస్‌ఐని మోసం చేసిన కేసులో నిందితుడిగా జైలు కెళ్ళి అక్కడ ఉన్న నేరస్తుల పరిచయాలతో దొంగతనాలు ఎలా చెయ్యాలో తెలుసుకుని బయటకు వచ్చాక వాన లక్ష్మణరావుతో దొంగతనాలు ప్రారంభించాడు. ఈ కేసుల్లో ఇంకా 400 గ్రాముల బంగారు ఆభరణలు రికవరీ చెయ్యవలసి ఉందని డీఎస్పీ తెలిపారు.

బంగారం కొనుగోలు చేసిన వ్యక్తి అరెస్టు

ఆవాల వెంకన్నబాబు, వాన లక్ష్మణరావు దొంగతనం చేసిన బంగారాన్ని భీమవరం గునుపూడిలో ఉన్న డిఆర్‌యుగోల్డ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న అందేకుమార్ శ్రీ నాగవెంకట త్రినాథ్‌కు అమ్మడం ప్రారంభించారు. ఈ కేసులో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. కంపెనీ ఆపరేషన్ మేనేజర్ శివకుమారి, కంపెనీ ఎండి అఖిలేష్ అగర్వాల్‌ను కూడా అదుపులోకి తీసుకోవల్సి ఉందని డీఎస్పీ తెలిపారు.

కూలిన భవనం పైకప్పు.. మహిళకు గాయాలు





కూలిన శిథిల భవనం పైకప్పు... గాయపడ్డ మహిళ

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న భవనం పైకప్పు కూలి మహిళకు గాయాలైన ఘటన తాడేపల్లిగూడెం పట్టణంలో సోమవారం చోటుచేసుకున్నది. పట్టణంలోని రేలంగి చిత్రమందిర్ సమీపంలోని 50 ఏళ్ల కిందటి శిథిల భవనం ప్రమాదకరంగా ఉంది. ఈ భవనం కూల్చాలంటూ మునిసిపల్ అధికారులు నోటీసులు ఇచ్చినా యాజమానులు స్పందించలేదు. అయితే ఆభవనాన్ని అద్దెకు ఇస్తూనే ఉన్నారు. అక్కడ చిన్న వ్యాపారం చేసుకుంటున్న పూర్ణకుమారి మహిళపై భవనం పైకప్పు కూలి గాయాలయ్యాయి. ఆ శిథిలాలకింద మరో రెండు మోటారుసైకిల్స్ దెబ్బతిన్నట్టు తెలుస్తోంది. సంఘటనా స్థలానికి మునిసిపల్, పోలీస్ అధికారులు చేరుకుని సహాయక చర్యలు చేస్తున్నారు.

హోమాల పేరుతో రూ.37లక్షలకు టోకరా

మొగల్తూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతిపై కేసు నమోదు చేసినట్టు మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు తెలిపారు. పెనుమంట్ర మండలం మల్లిపూడి గ్రామానికి చెందిన పెచ్చెట్టి గోపాల కృష్ణకు కుక్కల శ్రీను అనే వ్యక్తి ద్వారా మొగల్తూరుకు చెందిన సిద్ధాంతి ఆముదాలపల్లి వెంకటాచార్యులు పరిచయం అయ్యాడు. ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తారని శ్రీను చెప్పడంతో సిద్ధాంతిని గోపాల కృష్ణ కలిసి తన సమస్యలు చెప్పాడు. సిద్ధాంతి మూడు రోజుల పాటు హోమం చేయాలని చెప్పాడు. దీనితో గోపాలకృష్ణ తన ఇంటిలో ఎవరికి చెప్పకుండా సిద్ధాంతి ఇంటికి వెళ్ళాడు. మూడు రోజులు గడిచినా సరే ఏ హోమం చేయకపోవడంతో తాను ఇంటికి వెళ్ళిపోతానని గోపాలకృష్ణ అన్నాడు. దీనికి సిద్ధాంతి నిరాకరించాడు. నీవు ఇంటికి వెళితే మీ ఇంటిలో అంద రూ చనిపోతారని బయపెట్టి 54 రోజులు వెంకటాచార్యులు ఇంటిలో నిర్బంధించాడన్నారు. దఫ దఫాలుగా గోపాలకృష్ణ నుంచి రూ.37లక్షల 50వేలు వెంకటాచార్యులు వసూలు చేసినట్టు గోపాలకృష్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టైర్లు తీసుకువెళ్ళి సొమ్ములు ఇవ్వకుండా మోసగించిన ఇద్దరిపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు పడమరవీధికి చెందిన మెరుగుమాల శ్రీనివాసరావు ఏలూరు ఆటోనగర్‌లో టైర్ల షాపు నిర్వహిస్తున్నారు. గన్నవరానికి చెందిన అజిత్ సాయిబాబా పరిచయం అయ్యాడు. తమ స్నేహితుడు వీఎస్ గుప్తా గన్నవరంలో టైర్ల షాపు పెడుతున్నాడని కొంత సరుకు ఇవ్వాలని చెప్పడంతో రెండు లక్షల 21 వేల రూపాయల విలువైన టైర్లను శ్రీనివాసరావు ఇచ్చారు. డబ్బు ఇవ్వలేదు. వారిద్దరు ఉద్దేశ పూర్వకంగా మోసగించారని శ్రీనివాస రావు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థిపై బీరు సీసాతో దాడి

భీమవరం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య జరిగిన చిన్నపాటి తగాదాలో ఒక విద్యార్థిపై బీరుసీసాతో దాడి వరకు వెళ్ళింది. భీమవరం టూటౌన్ ఎస్‌ఐ పాజల్ రహమాన్ తెలిపిన వివరాలు ప్రకారం.. పట్టణంలోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జూనియర్, సీనియర్‌లు మధ్య చిన్నపాటి తగదా జరిగి ఇరువురు గెంటుకున్నారు. అనంతరం ఇంటికి వెళుతున్న సమయంలో రాయలం గ్రామ సమీపాన మేకా యశ్వంత్ అనే 4వ సంవత్సరం బిటెక్ విద్యార్థిపై కొంతమంది బీరు సీసాతో దాడి చేసి గాయపర్చగా ఆ విద్యార్థి ప్రస్తుతం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గోదావరిలో హాస్టల్ వార్డెన్ గల్లంతు



కొండ్రు రామిరెడ్డి (ఫైల్‌ఫొటో)

కొవ్వూరు/గోపాలపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో హాస్టల్ వార్డెన్ గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పోలవరం గ్రామానికి చెందిన కొండ్రు రామిరెడ్డి(58) గోపాలపురం ఎస్సీ హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం హాస్టల్లో హెల్పర్‌గా పనిచేస్తున్న మర్రి శ్రీనివాసుతో కలిసి కొవ్వూరు యానాది కాలనీలో పంక్షన్‌కు వచ్చాడు. భోజనం అనంతరం గోష్పాదక్షేత్రం వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తూ రామిరెడ్డి నదిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

యువకుడి మృతదేహం లభ్యం

యలమంచిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కత్తిమండ గ్రామానికి చెందిన పెచ్చెట్టి ఏసురాజు(32) మృతదేహం బాడవ వద్ద గోదావరిలో సోమవారం లభ్యమైందని ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఏసురాజు చించినాడ బ్రిడ్జిపై చెప్పులు, ఫోన్ నంబరు రాసి ఉన్న కాగితం పెట్టి శనివారం నుంచి కనిపించకుండా పోయిన సంగతి పాఠకులకు విదితమే. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.





ప్రత్యేక ఆకృతుల్లో ప్రమిదలు



ఏలూరులో రద్దీగా ఉన్న దుకాణం







ఆకట్టుకునే మోడల్స్‌లో ప్రమిదలు దీపాలు



ఏలూరులో విక్రయానికి సిద్ధంగా ప్రమిదలు

అందాల దీపావళి

• ఆకట్టుకుంటున్న ప్రమిదలు, దీపాలు • ఫ్యాన్సీ బాణసంచా

దీపావళి అంటేనే వెలుగుల పండుగ. వెలుగులకు అందాలు అద్దితే.. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా మార్కెట్‌లో అందమైన దీపాలు ఆకర్షిస్తున్నాయి. దీపావళి రోజు ఇళ్ల వద్ద ఏర్పాటుచేసే ప్రమిదలు వివిధ అందమైన రూపాల్లో పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఏలూరు నగరంలో పలుచోట్ల ప్రమిదలు, దీపాలు ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. ప్రమిదలు, దీపాలతోపాటు బాణసంచా కూడా కొత్త ఫ్యాన్సీ రకాలు వినియోదారులను కట్టిపడేస్తున్నాయి. పిప్‌పాప్స్ అనే అతిచిన్న ఉల్లిపాయ బాంబుల నుంచి మేజిక్‌విప్‌లు, మేజిక్ క్రాకర్స్, మూన్ మోడి, టివి టవర్, ఏరియల్ అవుట్, వంటి ఫ్యాన్సీ ఐటమ్స్ మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. రంగు రంగుల అగ్గిపెట్టెలు బాణసంచా సరుకులలో ప్రధాన ఆకర్షణ. జిల్లాలో ప్రస్తుతం హోల్‌సేల్ దుకాణాలలో బాణసంచా అమ్మకాలు జరుగుతుండగా రేపటి నుంచి తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. నగరంలో ఇండోర్ స్టేడియంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తుండగా జిల్లాలోని అన్ని పట్టణాలు, మండల కేంద్రాలలో, గ్రామీణ ప్రాంతాల్లో ఈ తాత్కాలిక లైసెన్సులతో బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. డీసీఎంఎస్ ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణంలో అమ్మకాలు జోరు పెరిగింది.

- ఏలూరు సిటీ



రక్తదానం చేస్తున్న ఎస్పీ కిశోర్

రక్తదానం.. ప్రాణ దానమే : ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణం కాపాడడమేనని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎస్పీ స్వయంగా రక్తదానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచారు. 18 నుంచి 55 ఏళ్ల వయసు ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చని సూచించారు. ఏలూరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు 40 మంది, రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు 15 మంది, ఆదిత్య కాలేజీ విద్యార్థులు 15 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఆరుగురు, పోలీసు అధికారులు, సిబ్బంది 42 మంది రక్తదానం చేశారు. వీరందరికి జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ప్రశంసా పత్రాలను అందించారు. డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, త్రి టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు, అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ 18 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని అభినందించారు.

నేటి నుంచి ఉద్యోగుల క్రీడా ఎంపికలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీసు ఉద్యోగులకు వివిధ క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపికలను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఇండోర్ స్టేడియంలో జరుగుతాయి. జిల్లాస్థాయిలో ఎంపికైనవారు నవంబరు 6 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులన్నారు.

విద్యార్థులకు లేఖ రచన పోటీ

ఏలూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): పాఠశాల విద్యార్థులకు జాతీయస్థాయి లేఖ రచన పోటీలను డిసెంబరు 14వరకు నిర్వహిస్తున్నట్టు తపాలాశాఖ ఏలూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్‌బాబు సోమవారం తెలిపారు. 'ది జాయ్ ఆఫ్ రైటింగ్, ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్' అంశంపై ఎన్వలప్ కవర్, ఇన్‌ల్యాండ్ లెటర్‌కార్డు విభాగాల్లో ఈ పోటీ జరుగుతుందన్నారు.



ఉచిత బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఆశ్రం సేవలు ప్రశంసనీయం

ఏలూరు రూరల్, అక్టోబరు 28, (ఆంధ్ర జ్యోతి): పేదలకు మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో ఆశ్రం వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం అభినందనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మన ఆశ్రం, మన ఆరోగ్యం పేరుతో ఏలూరులోని వివిధ ప్రాంతాల మీదుగా ఆశ్రం ఆసుపత్రికి వచ్చే వారికి ఏర్పాటుచేసిన ఉచిత బస్సు సర్వీసును సోమవారం ఆయన ప్రారంభించారు. ఆశ్రం సీఈవో హనుమంతరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పునరుత్పాదక వనరులపై విద్యార్థులు దృష్టి సారించాలి

పెదపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని పునరుత్పాదక వనరులపై దృష్టి సారించాలని విట్ కళాశాల ప్రొఫెసర్ లక్ష్మీసౌజన్య తెలిపారు. వట్లూరులోని సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో సహజ వనరుల వినియోగం - పునరుత్పాదక వనరులు అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్మీసౌజన్య మాట్లాడుతూ 2090 నాటికి భూమిపై సహజ వనరులు ఖాళీ అవుతాయన్నారు. ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక వనరులపై అవగాహన పెంచుకోవాల్సి ఉందన్నారు. ప్రిన్సిపాల్ జి.సరళ, శబరి, రూసీలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

30 వరకు సేవా కార్యక్రమాలు

ఏలూరు క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : దీపావళితో మై భారత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నెహ్రూ కేంద్ర ఆధ్వర్యంలో నగరంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి దూలం కిశోర్ తెలిపారు. పత్తేబాద రైతు బజార్‌లో శుభ్రత కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈనెల 30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.





ఏలూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే చింతమనేని, దెందులూరులో పరిష్కార వేదిక

సమస్యలు సత్వరం పరిష్కరించాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అర్జీలను సత్వరమే పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అధికారులతో ప్రజల సమస్యలపై చర్చించారు. ప్రతివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జరిగే మీకోసం కార్యక్రమంలో తాను భాగస్వామినవుతానన్నారు. పలువురు అందజేసిన సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీవో శ్రీలత, టీడీపీ నాయకులు నంబూరి నాగరాజు, నేతల రవి, అధికారులు పాల్గొన్నారు.

● దెందులూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం వచ్చే దరఖాస్తులను పరిష్కారంలో మొక్కుబడిగా వ్యవహరిస్తే మెమో, షోకాజ్ నోటిసులు జారీ చేస్తామని జేసీ ధాత్రిరెడ్డి అధికారులను హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ముప్పవరం గ్రామానికి చెందిన కొంత మంది కాల్వ సమస్య పరిష్కారం చేసినట్లు చూపారని చెప్పారు. దీనితో అధికారులను జేసీ హెచ్చరించారు. అర్జీలను సంబంధిత అధికారులతో పాటు తహసీల్దార్, ఎంపీడీవోలు పర్యవేక్షణ చేసి సమస్య నిర్ణీత సమయంలో పరిష్కారం చేయాలని సూచించారు. నిర్లక్ష్యం మహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు



ముఖ్యమంత్రిని కలిసిన వేలేరుపాడు నాయకులు

నిర్వాసితులకు పరిహారం నిర్ణయంలో అవకతవకలు

వేలేరుపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు చెల్లించే పరిహారం నిర్ణయంలో వైసీపీ పాలనలో అక్రమాలు జరిగాయని టీడీపీ నేతలు అన్నారు. మండల నేతలు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి నిర్వాసితుల ఇంటి విలువ నిర్ణయంలో అవకతవకలు వివరించారు. నిర్వాసితులకు సమాచారం లేకుండా అవార్డు పాస్ చేశారన్నారు. జగన్నాథపురంలో 140 మంది పేర్లు తొలగించారన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు అమరవరపు అశోక్, నూపా శ్రీరాములు, కరుటూరి రాధాకృష్ణ, జాగర్లమూడి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కోడి వ్యర్థాల తరలింపు

పెదపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద పాడు, సత్యవోలు, వసంతవాడ, వీరమ్మకుంట, ముప్పర్రు, కొణికి పరిసరాల్లో, కొల్లేరు పరిసర ప్రాంతాల్లో చేపల చెరువుల వద్ద పోలీసులు, మత్స్యశాఖ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. సుమారు 60 వేల కిలోల చికెన్ వ్యర్థాలతో ఉన్న ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆయా వాహనాల డ్రైవర్లు, యజమానులు, చెరువు యజమానులపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా నిల్వలు స్వాధీనం

ఏలూరు క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో దీపావళి బాణాసంచా నిల్వ ఉంచినట్లు టూ టౌన్ ఎస్ఐ నాగ కళ్యాణ్‌కు సమాచారం అందడంతో సిబ్బందితో సోమవారం రాత్రి దాడి చేశారు. బడేటి వారి వీధిలో నివాసం ఉంటున్న రొట్టా గంగాధరరావు ఇంట్లో మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గంగాధర్‌ను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు జాబ్‌మేళా

ఏలూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 30న సత్రంపాడు ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇన్‌చార్జి కిశోర్ సోమవారం తెలిపారు. వివిధ కంపెనీల్లో సుమారు 170 ఉద్యోగ ఖాళీల భర్తీ జరుగుతుందన్నారు.

● బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ నెల 30న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కిశోర్ తెలిపారు. 180 మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.



టీడీపీ సభ్యత్వాలను అందజేస్తున్న గన్ని

టీడీపీ సభ్యత్వాల నమోదు

ఉంగుటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వాలను జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు సోమవారం అందజేశారు. టీడీపీ నాయకులు పాతూరి సత్యనారాయణ, నల్లా ఆనంద్, కొండ్రెడ్డి శ్రీనివాస్, కాజ శ్రీనివాస్, మందలపు సత్యనారాయణ, వేములపల్లి సుధీర్, రాచూరి నవీన్, గంగాధర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సీడ్ మొక్కజొన్న సాగు నిబంధనలు పాటించాలి

చింతలపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సీడ్ మొక్కజొన్న సాగులో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో కె.మీనాకుమారి తెలిపారు. మండలంలో సీడ్ ప్రొడక్షన్ మొక్కజొన్న సాగు చేసే రైతులు నిబంధనలు పాటించాలన్నారు. నకిలీ విత్తనాలు, దిగుబడిపై రైతులు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. సీడ్ మొక్కజొన్న సాగు చేపట్టే రైతులు కంపెనీ ఆర్గనైజర్ల నుంచి రాతపూర్వక ఒప్పందం తీసుకోవాలన్నారు నిబంధనలు అతిక్రమించిన ప్రైవేటు కంపెనీ ఆర్గనైజర్లు, ఫీల్డ్ సిబ్బందిపై కూడా చర్యలు తప్పవన్నారు.

రైతుల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం



గోకులం షెడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ

పెదవేగి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని డ్వామా పీడీ వెంకట రమణ అన్నారు. రాయన్నపాలెంలో నిర్మించిన గోకులం షెడ్డులను సోమవారం ఆయన పరిశీలించారు. మండలంలో 67 గోకులం షెడ్డులు మంజూరయ్యాయని, ఉపాధి హామీ పథకం అనుసంధానంగా షెడ్ల నిర్మాణం జరుగుతుందని ఆయన చెప్పారు. ఇప్పటివరకు 11 గోకులం షెడ్ల నిర్మాణం పూర్తయ్యిందని, మిగిలిన వాటిని త్వరితగతిన నిర్మించేలా రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవోలు హేమలత, కిశోర్, సాంకేతిక సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సమయ పాలన పాటించాలి



మాట్లాతున్న సీడీపీవో విజయలక్ష్మి

పెదవేగి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని సీడీపీవో కె.విజయలక్ష్మి అన్నారు. పెదవేగిలో అంగన్‌వాడీ సెక్టారు సమావేశం సోమవారం నిర్వహించారు. కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారుల సంరక్షణపై సూచనలు ఇచ్చారు. గర్భవతులు, బాలింతలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పెదవేగి సెక్టారులో 13 అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, ఇతర సదుపాయాల కల్పనకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సెక్టారు సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెట్లు పెంచే అవకాశం కల్పించాలి

చింతలపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా అడవిలో చెట్లు పెంచుకునే అవకాశం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.వసంతరావు కోరారు. సోమవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వన సంరక్షణ సమితులకు అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు ఇస్తున్నారని, వాటిని సభ్యులు పెంచుతున్నారని, సకాలంలో మొక్కలు అందచేయకపోవడం వలన శ్రద్ధ ఉండడం లేదన్నారు. వ్యక్తిగతంగా మొక్కలు పెంచుకునే అవకాశం సభ్యులకు కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అటవీశాఖ ఉమ్మడి యాజమాన్యంలో జామాయిల్ పెంచుతున్నారని, వాటిని నరకడానికి అనుమతులు లేక చెట్లు ఎదిగినా పనికి రాకుండా పాడైపోతున్నాయన్నారు. సమావేశంలో బోడా వజ్రం, ఇస్తరాకుల వెంకటేశ్వరరావు, ఎం.అలగ్జాండర్, టి.బాబు పాల్గొన్నారు.

పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయానికి భక్తుల తాకిడి

పోలవరం అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తుల తాకిడి ఎక్కువైంది. తూర్పుగోదావరి జిల్లా దుళ్ళ నుంచి అయ్యప్ప స్వామి మాలధారులు, ఇతర ప్రాంతాల భక్తులు పట్టిసీమ శివక్షేత్రం చేరుకున్నారు. భావన్నారాయణ స్వామి, సీతారామచంద్రస్వామి, భద్రకాళీ, కాలభైరవ, లక్ష్మీ గణపతి తాండవ వీరభద్రుడు, సరస్వతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అంజనేయ స్వామి ఆలయాలను దర్శించుకున్నారు. భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి భక్తులు ఏకాదశ రుద్రాభిషేకాలు, బస్మార్చన, బిల్వార్చన నిర్వహించారు. ఆలయ సిబ్బంది వారికి పులిహోర ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్తీక మాసం ఆరంభం కానున్న నేపథ్యంలో నదీ తీరం నుంచి ఆలయ ప్రాంగణం వరకూ విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ సిబ్బంది వెంకట్రాజు తెలిపారు.

కుంతీ దేవి ఊరేగింపు

ద్వారకాతిరుమల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రంలో కొలువైన కుంతీదేవి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం కుంతి ఊరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలంకరణ చేసిన ఒక వాహనంలో ఉంచారు. తరువాత చిత్రవిచిత్ర వేషధారణలు, తీన్మార్ డప్పువాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ జరిగిన ఈ ఊరేగింపు చూపరులకు నేత్రపర్వమైంది.

రాష్ట్ర నర్సుల సంఘంలో జిల్లా నుంచి ఇద్దరి ప్రాతినిధ్యం



శుభాకాంక్షలు తెలియజేస్తున్న జిల్లా నేతలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గానికి జిల్లా నుంచి ఇద్దరు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా ఎం.దయావతమ్మ (హెడ్ నర్స్ ఏలూరు జీజీహెచ్), కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నికైన ఎన్.బేబి (హెడ్‌నర్స్, పోలవరం ఏరియా ఆస్పత్రి) ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడిజిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాస్, కార్యదర్శి రామారావును సోమవారం కలుసుకున్నారు. జిల్లా నర్సుల సంఘం కార్యదర్శి ఎం.లీలారాణి, రూత్ రికెట్స్, పలువురు హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉద్యోగుల పోరాటానికి సహకరించాలి

దాదాపు ఆరేళ్ళ విరామంతర్వాత ప్రభుత్వ నర్సుల సంఘానికి ఎన్నికలు నిర్వహించడంపై ఏపీ ఎన్‌హెచ్ఎం స్టాఫ్ నర్సుల యూనియన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జి.దయామణి హర్షం వ్యక్తంచేసారు. రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య పథకం (ఎన్‌హెచ్ఎం)లో 186 కేడర్లలో పనిచేస్తున్న దాదాపు 22 వేలమంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వైద్య ఉద్యోగులకు కనీస వేతన సేలు, అన్ని విభాగాల్లో ఒకే కేడర్ - ఒకే వేతనం అమలుకు నూతన కార్యవర్గం కృషిచేయాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్‌హెచ్ఎం ఉద్యోగులపై వివక్ష చూపిందన్నారు. పరస్పర, ఐచ్ఛిక బదిలీలకు అవకాశం కల్పించాలని, క్లియర్ వెకెన్సీలున్న చోట బదిలీలకు అవకాశమివ్వాలని కోరారు. పోరాటానికి గవర్నమెంట్ నర్సుల సంఘం కలిసిరావాలని అభ్యర్థించారు.

ప్రజా పోరు యాత్రలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ నవంబర్ 8 నుంచి 15 వరకు సీపీఎం ఆధ్వర్యంలో జరిగే ప్రజాపోరు యాత్ర జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కమిటీ సమావేశ తెల్లం రామకృష్ణ అధ్యక్షతన సోమవారం జరిగింది. సీతారాం మాట్లాడుతూ ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయాల వద్ద దర్నా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దరల పెరుగుదల, పెట్రోలు, డీజిల్, రిటైల్ దరలు తగ్గించాలని, నిరుద్యోగం, మౌలిక సేవల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని, మహిళలు, బాలికలపై లైంగిక దాడులు, నేరాలను అణచివేసేందుకు చర్యలు చేపట్టాలని, జమిలి ఎన్నికల ప్రతిపాదనను వ్యతిరేకించాలని, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితుల వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ప్రచార ఉద్యమం చేపడతామన్నారు. ప్రజాపోరు యాత్రలను ప్రజలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఎన్‌వీడీ.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిశోర్, ఎం.నాగమణి, జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహరావు, పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, కె.శ్రీనివాస్, పి.మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర కీలకం



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, అక్టోబరు 28: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర కీలకమని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్, పోలీసీ సీఐలతో సోమవారం ఆయన సమీక్షించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ మద్యం దుకాణాల పరిధిలో బెల్టు షాపులను ఏర్పాటుచేస్తే అడ్డుకోవాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక దరకు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చిత్తశుద్ధితో పనిచేస్తుందని పరిపాలనలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములవ్వాలని కోరారు. సమావేశంలో గణపవరం సీఐ మోగంటి వెంకట సుభాష్, భీమడోలు సీఐ యూవీ.జాన్ విల్సన్, ఎక్సైజ్ సీఐలు కళ్యాణ చక్రవర్తి (తాడేపల్లిగూడెం) సత్యనారాయణ(భీమడోలు) పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద పీడీఎస్‌యూ నాయకుల నిరసన



బుట్టాయగూడెం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు



పోలవరంలో వినతిపత్రం సమర్పిస్తున్న ఆదివాసీలు

సమస్యల హోరు

విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్‌వీఆర్‌కే విద్యాసంస్థల్లో ఏపీ ఓఎస్ఎస్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కరస్పాండెంట్ మురళీమోహన్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పీడీఎస్‌యూ నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు కాకినాని మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్న విద్యాసంస్థ గుర్తింపు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): పోలవరం నియోజకవర్గం కొత్తపట్టిసీమ రైతుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి రామ్‌ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఏడాది 11మంది రైతులు రూ.15 లక్షల విలువైన ధాన్యాన్ని తోలారన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వ్యక్తి నేటికి రైతులకు నగదు చెల్లించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్నోసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళినా పట్టించుకోలేదని ప్రస్తుతం రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మేకల శ్రీకృష్ణదేవరాయులు, గణపతి, రైతులు ధర్మరాజు, వీరరాఘవులు, అందే రాంబాబు, గోవిందరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగ నియమకాలు చేపట్టాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక జీవో తీసుకువచ్చి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, ఆదివాసీ విద్యార్థులకు న్యాయం చేయాలని ఏజెన్సీ ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రత్యేక చట్టంతో ఉద్యోగ నియమకాలు చేపట్టాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు రవ్వ బసవరాజు ఆధ్వర్యంలో మండలంలోని ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సంక్షేమ పరిషత్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ పివి చలపతిరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం నవంబరులో డీఎస్సీ ప్రకటిస్తున్నందున ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డీఎస్సీని ప్రకటించి ఉపాధ్యాయ నియమకాలు చేపట్టాలని కోరారు. ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం చేస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు కుంజా వెంకటేశ్వరావు హెచ్చరించారు. ఎంపీపీ కారం శాంతి, సర్పంచ్‌లు బన్నె బుచ్చిరాజు, జోడే దుర్గారావు, తెల్లం వెంకాయమ్మ, తాటి రాముడు, ఆదివాసీ నాయకులు తెల్లం లక్ష్మణరావు, సరియం కన్నపరాజు, అశోక్, అన్వేష్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: డిఎస్సీ 2024 ఉపాధ్యాయుల నియామకాలు స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు మండల విద్యాశాఖ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. మిడియం వెంకటస్వామి మాట్లాడుతూ జీవో 57 ప్రకారం షెడ్యూల్ ప్రాంతంలో నియామకాలను గిరిజన ప్రాంత అభ్యర్థులతో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో పాతకోట రామారావు, కుర్సం రమేశ్, కొక్కెర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అధ్యక్షుడు కాకి మధు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో డీఎస్సీకి ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. 1990 పూర్వం నుంచి ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సంజీవరావు, చినబాబు, వేణుగోపాల్, పాయం సత్యనారాయణ, అశోక్, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

తలరాతను మారుద్దాం



నేడు ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ డే

» మారిన ఆహార అలవాట్లతో రోగాలు » ఈ ఏడాది ఇప్పటివరకు 1300 పైగా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు

మారిన కాలంతో పాటు ఆహార అలవాట్లు మారాయి. రసాయన మిళిత ఆహారాలు మన సహజ ఆరోగ్యాన్ని దెబ్బతీసి వయసుతో సంబంధం లేకుండా కుంగ దీస్తున్నాయి. వీటితో పాటు మానసిక ఒత్తిడి, రుగ్మతలు బ్రెయిన్ స్ట్రోక్‌కి కారణమవుతున్నాయి. అక్టోబరు 29 వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే సందర్భంగా బ్రెయిన్ స్ట్రోక్ గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం..

- పోలవరం

మెదడుకి రక్తాన్ని సరఫరా చేసే మెదడు రక్తనాళాలపై ప్రభావం చూపే బ్రెయిన్ స్ట్రోక్‌ని వైద్య పరిభాషలో సెరెబ్రో వాస్కులర్ డిజార్డర్ అంటారు..దానినే మనం పక్షవాతం అని పిలుస్తాం. బ్రెయిన్ స్ట్రోక్‌లలో కూడా రెండు రకాలు ఉన్నాయి. నలుగురిలో ఒకరికి వారి జీవిత కాలంలో స్ట్రోక్ వచ్చే అవకాశాలున్నాయి. మెదడుకి రక్త సరఫరా తగ్గడం ప్రధానంగా రెండు కారణాల వల్ల జరుగుతుంది ఒకటి రక్తం గడ్డకట్టడం దీనిని వైద్య పరిభాషలో ఇస్కీమిక్ స్ట్రోక్ అంటారు. మరొకటి మెదడులో రక్తస్రావం..దీనిని వైద్య పరిభాషలో హెమరేజిక్ స్ట్రోక్ అని అంటారు. మెదడు సరిగా పని చేయడానికి అవసరమయ్యే ఆక్సిజన్ పోషకాల సరఫరాకు అంతరాయం కలగడం వల్ల శరీరంలో వచ్చే మేజర్ ఆరోగ్య మార్పులే పక్షవాతం. ఆక్సిజన్ లేదా రక్తం సరఫరా లేకపోవడం వలన కేవలం కొన్ని నిమిషాలు మెదడు కణాలు పని చేయకపోవడం, క్షీణించడం వల్ల మెదడు ప్రభావితమై శరీర భాగాలకు రక్త సరఫరా నిలిచి శరీర భాగాలు చచ్చు బడడం జరుగుతుంది. మెదడులో రక్త నాళం పగిలినప్పుడు సంభవించే అత్యవసర పరిస్థితి స్ట్రోక్ అని చెప్పవచ్చు. ఈ స్ట్రోక్ మెదడుకి నష్టం కలిగిస్తుంది. ఏలూరు జిల్లాలో ఈ ఏడాది 373 బ్రెయిన్ స్ట్రోక్ కేసులు నమోదు కాగా ప్రైవేటు ఆస్పత్రులలో సుమారు 900కి పైగా కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.

లక్షణాలు ఇవీ..

- శరీరంలో ఒకవైపున ఆకస్మిక తిమ్మిరి లేదా బలహీనత
- ఆకస్మిక ఆందోళన, మాట్లాడంలో ఇబ్బంది నాలుక మడతపడడం
- మాటలు వినిపించుకోవడం, అర్థం చేసుకోవడంలో ఇబ్బంది ఒకటి లేదా రెండు కళ్ళతో చూడడంలో ఇబ్బందులు
- తల తిరగడం , నడకలో మార్పు, సమతుల్యత కోల్పోవడం, సూచనలకు స్పందించలేకపోవడం
- వాంతులు లేదా అపస్మారక స్థితికి చేరుకోవడం.. అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి లక్షణాలు కనిపిస్తాయి.

ఎవరికి వస్తుంది

బీపీ కూడా స్ట్రోక్‌కి కారణమ వుతుంది. షుగర్ రోగుల్లో కూడా రక్త నాళాల్లో సంభవించే మార్పుల వల్ల స్ట్రోక్ వస్తుంది. ధూమపానం చేసేవారిలో ఇస్కీమిక్ స్ట్రోక్ సంభవించే ప్రమాదం రెట్టింపు ఉంటుంది. హైపర్ బ్లడ్ కొలెస్ట్రాల్ వల్ల రక్త నాళాలను కుంచించుకుపోయి మెదడు రక్త సరఫరాని తగ్గించడం వల్ల కూడా స్ట్రోక్ వస్తుంది. మరికొన్ని సందర్భాలలో లైంగిక సామర్థ్యాన్ని పెంచుందుకు వాడే నిషేధిత మందుల వాడకం వల్ల కూడా స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతాయి. మూత్ర విసర్జనపై నియంత్రణ లేకపోవడం వల్ల బ్యాగ్ అమర్చాల్సిన అవసరం వుంటుంది. న్యుమోనియా స్ట్రోక్‌తో బాధపడేవారిలో ఊపిరి తిత్తుల్లోకి ఆహారం పీల్చబడి ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ వస్తుంది. శరీర భాగాలపై నిరంతర ఒత్తిడి కారణంగా చర్మంపై బెడ్‌సోర్స్ అనబడే పుండ్లు ఏర్పడ వచ్చు. క్లినికల్ డిప్రెషన్, నిరంతర విచారం, మానసిక ఒత్తిడి వంటి అనుభూతి కలుగుతుంటుంది.

వచ్చిన వెంటనే ఏం చెయ్యాలి

24 నుంచి 48 గంటల్లో మెదడు, నరాల స్పెషలిస్టు , న్యూరాలజిస్టుని సంప్రదించి వైద్య సేవలం దించడం వల్ల మెరుగైన ఫలితాలుంటాయి. ప్రత్యేక శిక్షణ పొందిన న్యూరాలజిస్టులను వైద్య సేవల కోసం ఎంచుకోవాలి.

నివారణ చర్యలు

ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, రెగ్యులర్ హెల్త్ చెకప్‌ల ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌ని నివారించవచ్చు. అధిక కొవ్వులు కలిగిన ఆహారాలు మాని సాచురేటెడ్ ఫ్యాట్స్ కలిగిన, ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఉప్పు, చక్కెర వాడకం తగ్గించాలి చురుకైన నడక లేదా రెండున్నర గంటల ఏరోబిక్ ఫిజికల్ యాక్టివిటీ ద్వారా శరీరంలో అదనపు కొవ్వు కరిగించే వ్యాయామాలు వారానికి ఒకసారన్నా చేయాలి. బీపీ, సుగర్‌లను అదుపులో ఉంచుకోవడం , రెగ్యులర్ చెకప్‌లు చేసుకోవడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవకుండా చూసుకోవచ్చు.

మునిసిపల్ టీచర్లకు ప్రమోషన్లు

ఏలూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తీపికబురు. ఏళ్ళతరబడి బదిలీలు, పదోన్నతుల కోసం డిమాండ్ చేస్తున్న మునిసిపల్ టీచర్ల ఆకాంక్షలకు కార్యరూపమిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆ మేరకు మునిసిపల్ టీచర్ల పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించాల్సిందిగా ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనికనుగుణంగా ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా ప్రాతిపదికగా ఏలూరుజిల్లా డీఈవో నేతృత్వంలో పదోన్నతుల ప్రక్రియను చేపట్టారు.

ఉమ్మడి జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్, నిడదవోలు, నరసాపురం, తణుకు, భీమవరం, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, పాలకొల్లు మునిసిపాలిటీల్లో మొత్తం 230 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుండగా, వీటిలో సుమారు 1400మంది టీచర్లు పని చేస్తున్నారు. కూటమిప్రభుత్వం కొలువుతీరాక చేపడుతున్న మెగా డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్‌లో మునిసిపల్ పాఠశాలలకు చెందిన టీచర్ పోస్టుల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ల నుంచి దాదాపు 260 వెకెన్సీలను చేర్చినట్టు సమాచారం. మెగా డీఎస్సీకి చేర్చినవాటిలో 2025 మే నెలాఖరు వరకు ఏర్పడే వెకెన్సీలను కూడా చేర్చగా, ఇపుడు మిగతా ఖాళీలకు మాత్రమే పదోన్నతులను ఇచ్చేఅవకాశం ఉంది. దీనిపై విద్యాశాఖ నుంచి స్పష్టత రావాల్సిఉంది. వర్కింగ్ ఎస్జీటీల నుంచి తగిన అర్హతలున్నవారికి ఆయా సబ్జెక్టుల్లో అందుబాటులోవున్న ఖాళీలమేరకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు ఇవ్వడంద్వారా భర్తీచేయనున్నారు. ఆ ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఏలూరు నగరపాలకసంస్థలో 7 హైస్కూళ్ళు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, భీమవరం మునిసిపాలిటీల్లో 6 చొప్పున, నరసాపురం 5, నిడదవోలు 3, తణుకు, కొవ్వూరు మునిసిపాలిటీల్లో ఒకొక్కటి చొప్పున హైస్కూళ్ళలో అందుబాటులోవున్న ఖాళీల మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతులు ఇవ్వడంద్వారా భర్తీచేస్తారు. జంగారెడ్డిగూడెం, ఆకివీడు మునిసిపాలిటీలుగా వర్గోన్నతి అయినప్పటికీ, ఇంతవరకు అక్కడి పాఠశాలలను మాత్రం పురపాలకశాఖ పరిధిలోకి రాష్ట్రస్థాయిలో తీసుకురాలేదు. మరోవైపు ఏలూరు కార్పొరేషన్ పరిధిలోకి పరిసర గ్రామాలను కూడా గతంలోనే చేర్చినప్పటికీ, సంబంధిత ప్రాంతాల్లోని స్కూళ్ళు మాత్రం పంచాయతీరాజ్ పరిధిలోనే కొనసాగుతున్నాయి. ఇక తాజాగా మునిసిపల్ పాఠశాలల టీచర్లకు ఇవ్వడానికి ఉద్దేశించిన పదోన్నతులు మెగా డీఎస్సీకి చేర్చిన పోస్టులను మినహాయిస్తే ఉమ్మడి జిల్లాలో సుమారు 14 వరకు మాత్రమే ఉంటాయని ప్రాథమిక అంచనా. ఈ పదోన్నతులు మునిసిపాలిటీ లవారీగా ఎన్నెన్ని ఉంటాయనేదానిపై ఒకటిరెండురోజుల్లో స్పష్టత రానుంది.

వచ్చే నెలలో ప్రమోషన్లు

అర్హులకు ప్రమోషన్లను నవంబరు మొదటి వారంలో ఇస్తారు. కాగా పదోన్న తుల ప్రక్రియ ప్రకారం ఉమ్మడిజిల్లాలోని మున్సిపల్ టీచర్ల సీనియార్టీ జాబితాలు సోమవారమే విడుదల కావాల్సిఉండగా, కొత్తగా బదిలీపై జిల్లాకు నియమితులైన ఎం.వెంకటలక్ష్మమ్మ ఇంకా బాధ్యతలు చేపట్ట కపోవడంతో ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని జాబితాలను మంగళ లేదా బుధవారం విడుదలచేసే అవకాశం ఉంది. నూతన డీఈవో వెంకటలక్ష్మమ్మ జిల్లాలో బుధవారం విధుల్లో చేరతారని తెలిసింది.



కవ్వగుంటలో రహదారిపై ఆందోళన చేస్తున్న స్థానికేతరులు

భద్రత కరువైందని స్థానికేతరుల ఆందోళన

పెదవేగి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలు దాటి ఉపాధి కోసం వచ్చిన మాపై స్థానికంగా ఉండే కొంతమంది దాడులు చేస్తూ, భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని వారినుంచి రక్షణ కల్పించాలంటూ శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలకు చెందిన వ్యక్తులు రహదారిపై ఆందోళనకు దిగారు. పెదవేగి మండలం కవ్వగుంటలో సోమవారం ఉదయం స్థానికేతరులైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వందమందికిపైగా కవ్వగుంట రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సమయంలో రహదారిపై రాకపోకలు నిలిచిపోవడం, సమాచారం అందుకున్న పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ కె.రామకృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. అయితే ఆందోళన చేస్తున్న వ్యక్తులు మాత్రం ఎంతకూ పట్టు వీడకుండా తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని భీష్మించారు. రెండుగంటలకు పైగా నిరసన వ్యక్తంచేశారు. 40ఏళ్ళుగా ఇక్కడే ఉంటూ, కూలీపనులతో జీవనం సాగిస్తున్న మాపై గడచిన నాలుగేళ్ళుగా స్థానికులు దాడులు చేస్తున్నారని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై అలాంటి జరుగకుండా చూస్తా మని పోలీసులు ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు.



చాట్రాయి శ్మశాన స్థలంలో ఆరబోసిన మొక్కజొన్న కండెలు(ఫైల్)

శ్మశానాలే కల్లాలు

పంటల ఆరబోతకు స్థలాల్లేక రైతుల పాట్లు

చాట్రాయి, అక్టోబరు 28: గ్రామాల్లో పంటలు ఆరబోసుకోవడానికి కల్లాలు కరువై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గ్రామాల్లో ఖాళీ భూములు, బంజరు భూములు, సాగు చెయ్యని బీడు భూములు ఎక్కువగా ఉండేవి. వీటిలో రైతులు కల్లాలు చేసుకొని పంటలు ఆరబొట్టుకునే వారు. గ్రామాల్లో జనాభా పెరుగుతుండటంతో ఖాళీ స్థలాల్లో గృహాల నిర్మాణం జరిగింది. ఇక భూములు విలువ పెరగటం, బోరు బావుల విదానం రావటంతో బీడు భూములు, బంజరు భూములు అన్నీ సాగు భూములుగా మారిపోయాయి. దీనితో కల్లాలకు భూమి లేకుండా పోయింది. రైతులు చేసేది లేక రైతులు చెరువు లోతట్టు భూములు, అడవి భూములు, స్మశాన భూముల్లో కూడా కల్లాలు చేసుకొని పంటలు ఆరబెట్టుకోవల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం ఖరీఫ్ వరి పంట కోత దశకు వస్తున్నది. ఇటీవల కొన్ని నెలల పాటు భారీ వర్షాలు కురవటంతో చెరువులన్నీ నిండు కుండల్లా ఉన్నాయి. చెరువుల్లో కల్లాలు చేసుకొనే అవకాశం లేదు. ఈ సీజన్‌లో కల్లాలు ఎలా అని రైతులు ఆందోళ చెందుతున్నారు.

పంచారామాలకు బస్సులు

నూజివీడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పంచారామాల దర్శనానికి నూజివీడు ఆర్టీసీ బస్ డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం సూర్యపవన్‌కుమార్ తెలిపారు. నవంబరు 3వ తేదీ రాత్రి 9 గంటలకు బయలుదేరే సూపర్ లగ్జరీ బస్సు మరునాడు రాత్రి 10 గంటలకు నూజివీడు చేరుతుందన్నారు. టిక్కెట్ ధర రూ.1200 అని, ఈ బస్సు నవం బరు 10, 17, 24 తేదీల్లో కూడా అందు బాటులో ఉంటుందని, 20 మందికి మించి ప్రయాణికులు ఒకేచోట టిక్కెట్ బుక్ చేసుకుంటే బస్సు వారి వద్దకే వస్తుందన్నారు. అరుణాచలం, త్రిలింగ దర్శిని సర్వీసులు కూడా నడుపుతున్నట్టు వివరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

చాట్రాయి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాట్రాయి, చనుబండ, మర్లపాలెం, కోటపాడు, చీపురుగూడెం, ఆరుగొలనుపేట రైతు సేవా కేంద్రాలలో సోమవారం ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏవో శివశంకర్ మాట్లాడుతూ సాధారణ రకం ధాన్యం క్వింటాలుకు రూ. 2300, గ్రేడ్ ఏ రకం రూ. 2320కి కొనుగోలు చేస్తారని అన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు న్యాయం చేయాలి

ముసునూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాసిరకం మిర్చి నారు వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు నిమ్మగడ్డ నరసింహ కోరారు. మండలంలోని వలసపల్లి, యల్లాపురం గ్రామాల్లో 14 మంది రైతులు 21 ఎకరాల్లో నూజివీడు మండలం తుక్కులూరులో ఉన్న ఒక నర్సరీలో మిర్చినారు కొనుగోలు చేసి సాగుచేసిన మిరప పంటలను రైతుసంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. నారు నాసిరకంగా ఉండటంతో మొక్కల్లో ఎదుగుదల లేక చనిపోతున్నాయన్నారు. బాధిత రైతులు సమస్యను ఉద్యానవన అధికారులకు వివరించినా అధికారులు పట్టించుకోలేదన్నారు. బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతు సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ భారం వేస్తే ఉద్యమం

చాట్రాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం మోపటానికి నిర్ణయించటం దారుణమని సీపీఐ నాయకుడు నిమ్మగడ్డ నరసింహ, చెంగల వెంకట్రావు, కొమ్ము ఆనందం ఆరోపించారు. చిన్నంపేటలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ హామీ మేరకు పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఉపాధి పనులకు సంబంధించి సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. రూ.6.80కోట్ల విలువైన 1650 పనులను డీఆర్‌డీఏ ఏపీడీ దామోదర్, జిల్లా విజిలెన్స్ అధికారి పురుషోత్తమ రాజు, ఆడిట్ అధికారి సూర్యచంద్ర, ఎంపీడీవో ఫణీంద్ర పరిశీలించారు. గ్రామాల్లో జరిగిన సామాజిక తనిఖీల నివేదికలు కూడా పరిశీలించిన అనంతరం కొన్నిచోట్ల కూలీల మస్తర్లు సక్రమంగా లేవని, రికార్డులు నిర్వహణ కూడా బాగోలేదనే కారణంతో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.2 వేలు జరిమానా విధించినట్లు ఏపీవో చరణ్ తెలిపారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన



కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలంలోని ఎల్ఐసీ ఏజెంట్లు తమకు కమీషన్ పెంచాలని, బోనస్ ఇవ్వాలని, ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘ నాయకులు కృపానందరావు, విజయరావు, కొండపల్లి, నాగేశ్వరరావు, ఆనంద్ ఆధ్వర్యంలో ఏజెంట్లు ధర్నా నిర్వహించారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : మంత్రి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సారథి

నూజివీడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా రూ.120 కోట్లతో సీసీ రహదారుల అభివృద్ధిని చేపట్టినట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసుపార్థసారధి అన్నారు. సోమవారం నూజివీడు మండలం అన్నవరంలో ఉపాధి నిధులు రూ. 20 లక్షలతో చేపట్టనున్న మూడు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ధాన్యం కొనుగో లు చేసి సొమ్ము చెల్లించకుండా రూ.1600 కోట్లు బకాయి పెట్టిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని రైతులకు చెల్లించిందన్నారు. రాష్ట్రంలో ఐదు మేజర్ ప్రాజెక్టులలో చింతలపూడి ఎత్తిపోతల పథకం ఒకటని, రాబోయే రోజుల్లో ప్రాజెక్టును పూర్తిచేసి గోదావరి జలాలను నూజివీడు నియోజకవర్గానికి అందించనున్నా మన్నారు. తహసీల్దార్ బి.సుబ్బారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో సుమారు రూ.10లక్షల వ్యయంతో రెండు సీసీ రహదారుల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. గ్రామ సమస్యలను పలువురు మంత్రి దృష్టికి తేగా తక్షణం పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

అగ్రిమెంట్ తర్వాతే విత్తన సాగు చేపట్టండి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ బాషా

నూజివీడు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): లిఖితపూర్వక అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే విత్తన మొక్కజొన్న సాగు చేపట్టా లని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. నూజివీడు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో ఆయన విత్తన కంపెనీ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ విత్తన మొక్కజొన్న పంట వేసిన వెంటనే రైతులు సంబంధిత గ్రామ సహాయకులకు కంపెనీ విత్తన రకాన్ని తెలుపుతూ ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. పైరులో ఏదైనా తేడా గమనిస్తే ఆర్గనైజర్లు, రైతులు వెంటనే ఏవో దృష్టికి తేవాలన్నారు. దిగుబడిలో వ్యత్యాసాలు గమనిస్తే క్షేత్ర స్థాయి లో పంట భూమి మీద ఉన్నప్పుడే ఫిర్యాదు చేయాలని కోత అనంతరం ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదన్నారు. ప్రైవేటు కంపెనీ ఆర్గనైజర్లు నిబంధనలను అతిక్రమిస్తే చట్టప రమైన చర్యలుంటాయన్నారు. నూజివీడు, చాట్రాయి, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల ఏవోలు, ఎఫ్‌పీవో సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రతి పట్టభద్రుడి ఓటు కీలకమే

ముదినేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగబోయే కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల టీడీపీ పరిశీలకుడు సామిరెడ్డి కోరారు. సోమవారం ముదినేపల్లిలో పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కైకలూరు (ముదినేపల్లి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సి విధానాలపై సోమవారం కైకలూరులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు మురిగిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఓట్లు నమోదులో కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎంపీపీ అడవి వెంకట కృష్ణ, ఎంఈఓ డి. రామారావు, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు సహకారం అందించాలని మంత్రికి వినతి



కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు తీరప్రాంత మత్స్యకారులకు ప్రభుత్వ సహకారం అందించాలని రాష్ట్ర సహకార శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడును టీడీపీ వడ్డి సాధికార కన్వీనర్ బలే ఏసురాజు కోరారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి మత్స్యకారులకు గతంలో ఇచ్చినట్టే పడవలు, ద్విచక్ర వాహనాలు, కర్రలు, వలలు 90 శాతం రాయితీపై ఇవ్వాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఏసురాజు తెలిపారు.

టీడీపీ సభ్యత్వాలిలా..

నూజివీడు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లిలో టీడీపీ సభ్యత్వాన్ని ఆ పార్టీ నూజివీడు మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ పొట్లూరు సత్యనారాయణ ప్రారంభించారు. అధిక సంఖ్యలో సభ్యత్వాలను నమోదు చేసి నూజివీడు మండలాన్ని ప్రథమ స్థానంలో ఉంచేలా కృషి చేయాలని కోరారు. మర్రిపూడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొట్లూరి శాంతికుమార్, టీడీపీ నాయకులు గోగినేని మధు, తుమ్మల ఆది తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: మండల వ్యాప్తంగా టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతోంది. సోమవారం వలసపల్లి, ముసునూరు, చెక్కపల్లి, వేల్పుచర్ల, గోపవరం తదితర గ్రామాల టీడీపీ నాయకులు సభ్యత్వ నమోదు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దేవినేని డలరామ్ పర్యవేక్షించగా గ్రామ అధ్యక్షుడు సురేంద్ర, నియోజకవర్గ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి నక్కా యోహాను, తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: వడాలిలో సోమవారం కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు నిర్వహించారు. సభ్యత్వం తీసుకున్న వారికి కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. పార్టీ నాయకుడు గురువు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రి మృతి

కలిదిండి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుకొల్లుకు చెందిన పాలూరి సురేష్ (40) సోమవారం తాపీపని చేస్తుండగా విద్యుత్ వైరు చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. కోరుకొల్లు పీహెచ్‌సీకి తరలించగా మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక స్థితి సరిలేక..

ఆగిరిపల్లి: మానసిక స్థితి సరి లేక నిద్ర మాత్రలు మింగి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అడవినెక్కలంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం కూలిపనులు చేసి జీవించే అడవినెక్కలం గ్రామానికి చెందిన లక్ష్మి బాబు (43) కొంతకాలం నుంచి అనారోగ్యం కారణంగా సరిగా నిద్రపట్టక వైద్యుడి సూచనల మేరకు స్లీపింగ్ టాబ్లెట్లు వాడేవాడని 24న అధిక మాత్రలు మింగి అపస్మారక స్థితికి చేరుకోగా విజయవాడ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 27న మృతి చెందాడన్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ మృతి

ముదినేపల్లి: గత నెల 23న ముదినేపల్లి-కైకలూరు జాతీయ రహదారిలో రంగాపురం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కైకలూరు మండలం రాచపట్నంకు చెందిన దట్టార రమేష్ (35) మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో బైక్‌పై నుంచి పడిన రమేష్ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి రమేష్ మృతి చెందాడని ఎస్సై వీరభద్రరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

ముసునూరు: మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన కోడె శ్రీనివాసరావు ఇంట్లో ఆదివారం రాత్రి గ్యాస్ లీకై సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. శ్రీనివాసరావు భార్య వంట చేస్తుండగా గ్యాస్ ఒక్కసారిగా లీకై మంటలు చెలరేగడంతో ఆమె బయటకు పరుగులు తీసింది. ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధమై బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. ఘటనను గ్రామ వీఆర్వో శ్రీనివాసరావు పరిశీలించి రూ.10 లక్షలు నష్టం వాటిల్లినట్లు నివేదికను ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తమ శర్మకు అందచేశారు.



ఆర్డీవోతో మాట్లాడుతున్న ముద్దరబోయిన

అక్రమ మైనింగ్ అరికట్టండి

నూజివీడు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో కొండలను పిండి చేస్తూ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నూజివీడు ఆర్డీవో ఎం.వాణికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు వినతిపత్రాన్ని అందించారు. సిద్ధార్థ నగర్, సుంకొల్లు గ్రామాల్లో అటవీ భూమి సాగు చేసుకుంటున్న పేదల భూములను డబ్బు ఆశ చూపి కొనుగోలు చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు సూచించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'కు వివిధ సమస్యలపై 14 అర్జీలు దాఖలైనట్టు ఆర్డీవో ఎం.వాణి తెలిపారు.

శ్మశాన వాటికకు భూమి కేటాయించరూ..

చాట్రాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్వతాపురంలో దళితులకు శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని భూమి కేటాయించాలని సోమవారం ఆ గ్రామస్థులు తహసీల్దార్ ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. ఎవరైనా చనిపోతే చెరువుల ముందు, రోడ్డు మార్జిన్లలో అంత్యక్రియలు చేయవల్సివస్తున్నదని, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం పాల్గొన్నారు.

గేట్ పరీక్షలపై అవగాహన

నూజివీడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలో హయ్యర్ ఎడ్యుకేషనల్ సెల్ ఆధ్వర్యంలో గేట్, ఐఈఎస్ పరీక్షల నిర్వహణపై మేడ్ ఈజీ సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంస్థ సీనియర్ ఫ్యాకల్టీ జితేంద్ర తివారీ, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లలో తరగతుల నిర్వహణపై వివరించారు. హయ్యర్ ఎడ్యుకేషనల్ సెల్ ఇన్‌చార్జ్ ఎం.రామకృష్ణ, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్, ఏవో బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

30న బలివే హుండీల లెక్కింపు

ముసునూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30న హుండీల లెక్కింపు జరుగుతుందని, ఆలయ కార్యనిర్వహణ అధికారి పామర్తి సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఉన్న నాలుగు హుండీలను ఉదయం 11 గంటల నుంచి పోలీస్, రెవెన్యూ శాఖల సమక్షంలో దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు జరుగుతుందన్నారు.

అక్రమంగా బాణాసంచా విక్రయిస్తే చర్యలు : ఎస్ఐ

కలిదిండి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 11 బాణాసంచా దుకాణాలకు అనుమతులు మంజూరయ్యాయన్నారు. జన సంచారం లేని ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, షాపుల వద్ద నిబంధనలు పాటించాలన్నారు.



చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు

ఆగిరిపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నున్న పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్టు హెచ్‌ఎం టి. శోభన్‌బాబు తెలిపారు. విజేతలకు పవర్‌గ్రిడ్ జీఎం నాగమోహన్‌రావు, డిప్యూటీ మేనేజర్ శివ నాగేశ్వరరావు, సర్పంచ్ ఆరేపల్లి పద్మ బహుమతులు అందించారు.